

గందరగోళం!

జిల్లాలో పూర్తికాని టిడ్కో గృహాలు

ఆగస్టు 10లోగా ఇళ్లలోకి వెళ్లాలని మచిలీపట్నం అధికారుల ప్రకటన

టిడ్కో గృహాల లబ్ధిదారుల పరిస్థితి ముందు నుయ్యి వెనుక గొయ్యి అన్న చందంగా తయారైంది. నిర్మాణాలు పూర్తి కాకుండా, కనీస వసతులు కల్పించకుండా ఇళ్లలోకి వెళ్లాలంటూ లబ్ధిదారులకు అధికారులు గడువు విధించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇళ్లలోకి వెళ్లకపోతే నోటీసులు కూడా ఇవ్వకుండా వేరే వారికి కేటాయిస్తామని బెదిరించడం సరికాదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఇళ్లలోకి వెళ్లిన గుడివాడలోని లబ్ధిదారులు సౌకర్యాలు లేవని తరచూ రోడ్డెక్కుతున్నారు. అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- అసంపూర్తిగా రుద్రవరంలోని గృహసముదాయాల నిర్మాణం
- ఆందోళనలో మచిలీపట్నం కార్పొరేషన్ పరిధిలోని లబ్ధిదారులు
- ఉయ్యూరులో నాలుగేళ్లుగా ముందుకు సాగని పనులు
- గుడివాడలో కనీస వసతుల కోసం రోడ్డెక్కుతున్న లబ్ధిదారులు
- వసతులు కల్పించకుండా, నిర్మాణాలు పూర్తిచేయకుండా ఇళ్లలోకి వెళ్లమంటున్న అధికారులపై సర్వత్రా విమర్శలు


రుద్రవరం వద్ద టిడ్కో గృహాలు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లాలో పేద, మధ్య తరగతికి చెందిన లబ్ధిదారులకు కేటాయించిన టిడ్కో గృహాల అప్పగింత అంశం గందరగోళంగా మారింది. ఆంధ్రప్రదేశ్ టౌన్‌షిప్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(టిడ్కో) ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా 2017లో అప్పటి టీడీపీ ప్రభుత్వం జిల్లాలో 13,712 గృహాల నిర్మాణాలను ప్రారంభించింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ గృహాల నిర్మాణాలను నిలిపివేసింది. 2021లో పనులు ప్రారంభించినా ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. కొన్ని గృహాలు పూర్తి చేసినా, ఈ సముదాయాల వద్ద కనీస సౌకర్యాలు కల్పించలేదు. అక్కడ నివాసం ఉండేందుకు అవకాశం లేని స్థితి. అయినా ఆగస్టు 10వ తేదీలోగా ఈ నివాసాల్లోకి లబ్ధిదారులు వెళ్లకుంటే, వారికి గృహాలు అవసరం లేనట్లుగా గుర్తించి ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే వేరే లబ్ధిదారులకు ఈ గృహాలను కేటాయిస్తామని మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఓ అడుగు ముందుకేసి పత్రికా ప్రకటన జారీ చేయడంతో లబ్ధిదారుల్లో అలజడి మొదలైంది. కనీస సౌకర్యాలు ఉంటే అక్కడకు వెళ్లి నివాసం ఉంటామని, ఇప్పటికిప్పుడు గృహాల్లోకి వెళ్లి కాపురం ఉండాలంటే కష్టమని లబ్ధిదారులు అంటున్నారు.

2,300 గృహాలకు తగ్గింపు

2017లో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మచిలీపట్నంలో ఆరు వేల మంది లబ్ధిదారులు టిడ్కో గృహాల కోసం నగదు చెల్లించారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అసలైన లబ్ధిదారులు నగదు చెల్లించలేదని, గృహాల నిర్మాణవ్యయం అధికంగా అంచనాలు వేశారనే కారణంతో ఈ గృహాల సంఖ్యను 2,300 తగ్గించారు. రివర్స్ టెండరింగ్ పేరుతో గృహాలను నిర్మాణం చేయకుండా గత వైసీపీ ప్రభుత్వం మూడు సంవత్సరాల పాటు ఆలస్యం చేసింది. మచిలీపట్నం లోని గోసంఘం వద్ద ఉన్న గృహ మిగతా 6లో..

గుడివాడలో తరచూ ఆందోళనలు

గుడివాడ నియోజకవర్గం మల్లాయపాలెంలో నిర్మించిన 8,912 గృహాలను 2022 జూన్ నెలలో లబ్ధిదారులకు అప్పగించినట్లుగా చూపారు. వీటిలో 1800 గృహాలను లబ్ధిదారులకు నేటికీ అప్పగించలేదు. ఇక్కడ కనీస సౌకర్యాలు కల్పించాలని తరచూ స్థానికంగా నివాసం ఉండేవారు ఆందోళనలకు దిగుతున్నారు. పెనమలూరు నియోజకవర్గం పరిధిలోని ఉయ్యూరు టౌన్ పరిధిలోని జెమిని స్కూల్, ఎగినపాడు, గండిగుంట పంచాయతీ పరిధిలో మూడు ప్రాంతాల్లో 2,946 టిడ్కో గృహాల నిర్మాణం చేయాల్సి ఉంది. ఈ పనులను నాలుగు సంవత్సరాలుగా నిలిపివేశారు. ఎప్పటికి పనులు తిరిగి ప్రారంభిస్తారో కూడా తెలియనిస్థితి నెలకొంది. కాంట్రాక్టర్లకు పనులు ప్రారంభించాలని చెబుతున్నా, జాప్యం చేస్తున్నారని టిడ్కో అధికారులు చెబుతున్నారు.

లంచావతారం!

గుడివాడ డివిజన్‌లోని ఓ స్టేషన్ ఎస్ఐ తీరుతో జనం బెంబేలు

- బాధితులు, నిందితుల నుంచి ముడుపుల వసూలు
- స్థానిక వ్యాపారులతో నగదు లావాదేవీలు
- ఇక్కడి విషయాలు పైఅధికారులకు చేరవేస్తున్నారని సిబ్బందితో గొడవ
- పోలీస్ స్టేషన్‌కు రావాలంటే భయపడుతున్న ప్రజలు



పొరుగున ఉన్న జిల్లా నుంచి గత ఏడాది ఆగస్టు నెలలో ఎస్ఐ స్థాయి అధికారి జిల్లాకు వచ్చారు. గుడివాడ డివిజన్‌లోని ఒక పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్నారు. ఇక్కడకు వచ్చి బాధ్యతలు స్వీకరించిన రెండు నెలల పాటు సక్రమంగానే పనిచేశారు. ఆ తర్వాత నుంచి ఆయనలో ఉన్న అవినీతి కోణాన్ని వెలికితీసి తనదైన శైలిలో వ్యవహరిస్తున్నారు. స్టేషన్‌కు వచ్చిన బాధితులు, నిందితులు అనే తేడా లేకుండా తన అనుభవమంతా ఉపయోగించి ముక్కుపిండి ముడుపులు వసూలు చేస్తున్నారు. దీంతో స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయాలంటేనే ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : స్టేషన్ హౌస్ ఆఫీసర్ అయిన సదరు అధికారి స్టేషన్‌కు వచ్చే బాధితులు, నిందితులతో బేరాలకు దిగుతున్నట్టు సమాచారం. ఇంత మొత్తంలో ఇస్తే కేసులు నమోదు చేస్తానని బాధితులతో, ఇంతమొత్తం ఇస్తే తక్కువ శిక్షలు పడేలా సెక్షన్లు వేస్తానని నిందితులతో బేరాలు మాట్లాడుకుంటున్నట్టు తెలిసింది. తన స్టేషన్ పరిధిలో ఉన్న వ్యాపారస్తులతో పరిచయాలు పెంచుకుని, వారిని స్టేషన్‌కు పిలిపించి, మీతో స్నేహంగా ఉంటానని, మీ అకౌంట్‌లో తాను చెప్పిన మనుషులు నగదు వేస్తారని, వాటిని మిగతా 6లో..

నాడు టీడీపీ ప్రభుత్వంలో ముక్త్యాల ఎత్తిపోతలకు శంకుస్థాపన కార్యక్రమంలో శ్రీరామ్ తాతయ్య, నెట్టెం రఘురాం



ముక్త్యాల లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు కూటమి ప్రభుత్వం రూ.489.28 కోట్లు మంజూరు చేయటంతో నియోజవకర్గంలోని నాగార్జున సాగర్ ఆయకట్టు రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది. రాష్ట్ర విభజన తర్వాత సాగర్ ఆయకట్టు నానాటికీ తీసికట్టు అన్న చందాన మారిపోయింది. తెలంగాణప్రాంతం నుంచి ఎప్పుడు సాగునీరు విడుదల అవుతుందా అని ఎదురుచూపులతోనే కాలం గడిచిపోతోంది. ఇటువంటి పరిస్థితుల్లో నిధులు కేటాయించి ప్రభుత్వం రైతులకు అండగా నిలిచింది.

ముక్త్యాలకు పునరుజ్జీవం

ఎత్తిపోతల పథకానికి రూ.489.28 కోట్లు విడుదల

- రైతుల సాగునీటి ఇబ్బందుల దృష్ట్యా కూటమి ప్రభుత్వం నిర్ణయం
- ఇక 38,627 ఎకరాల సాగర్ ఆయకట్టు కృష్ణాజలాలతో సస్యశ్యామలం
- రైతాంగంలో ఆనందోత్సాహాలు

(ఆంధ్రజ్యోతి, జగ్గయ్యపేట): ముక్త్యాల నుంచి కృష్ణాజలాలను ఎత్తి సాగర్ కాల్వలకు అందించేందుకు గత టీడీపీ ప్రభుత్వం ముక్త్యాల ఎత్తిపోతలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ ప్రాజెక్టు పనులు 2019లో వర్చువల్‌గా చంద్రబాబు ప్రారంభించారు. ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ముక్త్యాల ఎత్తిపోతల పేరును వేదాద్రి ఎత్తిపోతలుగా పేరు మార్చి నాటి సీఎం జగన్ తన పెళ్లిరోజున వర్చువల్‌గా మళ్లీ శంకుస్థాపన చేశారు. పనులు మాత్రం ముందుకు సాగలేదు. వేదాద్రి దగ్గర పనులు ప్రారంభించిన నిర్మాణ సంస్థ తర్వాత నిధులు విడుదల కాకపోవటంతో యంత్రాలు, మెటీరియల్‌ను తీసుకెళ్లిపోయింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో తిరిగి ఈ ముక్త్యాల ఎత్తిపోతల పథకాన్ని తిరిగి ప్రారంభిస్తామని ఎన్నికల హామీగా ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ ప్రకటించారు. ఆ తర్వాత పలుమార్లు ఎంపీ కేశినేని, శ్రీరాం తాతయ్య, కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురాం, ఆప్కాబ్ మాజీ చైర్మన్ టీడీ జనార్ధన్‌లు మిగతా 6లో..

బెజవాడలో లులూకు భూ కేటాయింపు

పాతబస్టాండ్ ఆర్టీసీ స్థలం 4.15 ఎకరాలపై జీవో జారీ

- జీ ప్లస్ 3 విధానంలో ఇంటర్నేషనల్ షాపింగ్ మాల్
- రూ. 156 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయనున్న 'లులు'
- ఏర్పాటుకానున్న మొత్తం 120 రిటైల్ షాపులు
- బయటి వారి కోసం 1.34 లక్షల చదరపు అడుగుల స్థలం లీజుకు
- 200 వాహనాల సామర్థ్యంతో కూడిన పార్కింగ్ ఏరియా
- మల్లవల్లి మెగా ఫుడ్‌పార్క్ సీపీసీ నిర్వహణ చేపట్టనున్న 'లులు'



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): నగరంలోని పాత బస్టాండ్ ఆర్టీసీ స్థలాన్ని 'లులు' మాల్ కోసం కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ఆదేశాలు జారీ చేసింది. మొత్తం 4.15 ఎకరాల విస్తీర్ణం కలిగిన ఆర్టీసీ స్థలాన్ని లులు ఇంటర్నేషనల్ షాపింగ్ మాల్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఎల్ఐఎస్ఎం) గ్రూపునకు 65 సంవత్సరాల సుదీర్ఘ కాలానికి లీజుకు ఇస్తూ భూ కేటాయింపులు జరిపింది. ఆ తర్వాత మరో 33 సంవత్సరాలు పొడిగిస్తారు. మూడేళ్ల పాటు అద్దె వెసులుబాటును కల్పించింది. నిర్మాణం పూర్తి చేయటానికి నిర్దేశించిన కాలానికి ఈ మేరకు అద్దెను మినహాయించింది. పాత బస్టాండ్ ఆర్టీసీ స్థలంలో 2.32 లక్షల చదరపు అడుగుల స్థలంలో జీ ప్లస్ 3 విధానంలో అంతర్జాతీయ స్థాయి షాపింగ్ మాల్‌ను 'లులు' నిర్మించనుంది. ఇంటర్నేషనల్ షాపింగ్ మాల్ నిర్మాణం కోసం 'లులు' రూ. 156 కోట్లను ఖర్చు చేయబోతోంది. ఈ మాల్‌లో 'లులు' మొత్తం 120 రిటైల్ షాపులను ఏర్పాటు చేస్తుంది. బయటి వారికి ఈ మాల్‌లో 1.34 లక్షల చదరపు అడుగుల స్థలాన్ని లీజుకు ఇస్తుంది. మొత్తం 200 వాహనాల పార్కింగ్ ఏరియాను మిగతా 6లో..

ఆర్టీసీ నుంచి స్థలం స్వాధీనంపై కలెక్టర్‌కు ఆదేశం

ఆర్టీసీకి చెందిన 4.15 ఎకరాల పాతబస్టాండ్ స్థలాన్ని త్వరగా స్వాధీనంలోకి తీసుకుని పర్యాటక శాఖకు అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వం ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జీ.లక్ష్మీశకు నిర్దేశించింది. ఆర్టీసీ ప్రతిపాదనల మేరకు వారి అవసరాలకు తగినట్టు ప్రత్యామ్నాయ స్థలాలను కూడా త్వరగా చూసి తక్షణం ఆర్టీసీకి బదలాయింపు చేయాలని స్పష్టం చేసింది.

ఆందోళనల నడుమ భూ కేటాయింపులు

నగరంలో పాతబస్టాండ్ ఆర్టీసీ స్థలాన్ని 'లులు'కు ఇవ్వాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్న ఆందోళనలు పెద్ద ఎత్తున జరిగాయి. గతంలో పాతబస్టాండ్ స్థలాన్ని ఆనుకుని ఉన్న ప్రస్తుత పార్కు స్థలాన్ని అంబికా ఇతర సంస్థలకు అప్పగించినపుడు కూడా ఆందోళనలు పెద్ద ఎత్తున చేశారు. అప్పట్లో ఆర్టీసీ అధికారులు బీవోటీ కింద అప్పగించారు. అవి విఫల ప్రాజెక్టులుగా నిలవటం వల్ల వాటి భూ కేటాయింపులను రద్దు చేశారు. ఆ తర్వాత ఆ స్థలంలో పార్కును ఏర్పాటు చేయటం జరిగింది. ఈ సారి పార్కు స్థలంతో పాటు ఆర్టీసీ గవర్నర్‌పేట-2 డిపో స్థలాన్ని కూడా అప్పగిస్తుండటంతో ఆందోళనలు మరింత తీవ్రస్థాయిలో జరిగే అవకాశం కూడా లేకపోలేదు.

రంగంలోకి దిగాలని ఏపీఐఐసీకి ఆదేశాలు

టూరిజం పాలసీలో భాగంగా స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు (ఎస్ఐపీబీ) తీసుకున్న నిర్ణయం మేరకు 'లులు' సంస్థకు కేటాయించిన భూములలో తక్షణం ఇంటర్నేషనల్ షాపింగ్ మాల్ కోసం చర్యలు చేపట్టాల్సిందిగా ఏపీఐఐసీ అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. నిర్ణీత క్రమంలో పనులు జరిగేలా పర్యవేక్షించాలని నిర్దేశించింది.

బీచ్‌లో అధికారులతో మాట్లాడుతున్న మంత్రి రవీంద్ర



బీచ్‌ను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుదాం

మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : మంగినపూడి బీచ్‌ను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర గనులు, భూగర్భవనరులు, ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఆదివారం మంత్రి మంగినపూడి బీచ్‌ను సందర్శించారు. బీచ్ అభివృద్ధిపై టూరిజం అధికారులు, స్థానికులతో చర్చించారు. పర్యాటకులను ఆకర్షించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. అధికారులకు పలు సూచనలు చేశారు.

బెజవాడలో నీటి సరఫరాపై మోదీ ఫిదా!

మన్‌కీ బాత్‌లో ప్రత్యేకంగా ప్రస్తావించిన ప్రధాని



- బెజవాడలో 16 లక్షల మందికి మెరుగైన తాగునీటి వ్యవస్థ
- ఆధునిక వ్యవస్థతో నూరుశాతం రక్షిత నీటి సరఫరా
- 30 శాతం జనాభా ఉంటున్న కొండ ప్రాంతాలకు కూడా బూస్టర్స్ ద్వారా తాగునీరు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/ కార్పొరేషన్): బెజవాడ నగరంలో మంచినీటి నిర్వహణ తీరు దేశ ప్రధాని మోదీ మనస్సు గెలుచుకుంది. ఆదివారం మన్‌కీ బాత్ కార్యక్రమంలో మాట్లాడిన మోదీ విజయవాడలో నీటి నిర్వహణ గురించి ప్రత్యేకంగా ప్రస్తావించటం నగరానికి గర్వకారణంగా నిలిచింది. 16 లక్షల మంది జనాభా కలిగిన నగరానికి మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు సురక్షితమైన మంచినీటిని అందిస్తున్నారు. నీరు వృథా కాకుండా సమర్థవంతమైన 'స్కాడా' వంటి అత్యాధునిక సాంకేతిక విధానాన్ని కూడా కార్పొరేషన్ అనుసరిస్తోంది. వాటర్ ఆడిటింగ్ జరపుతూ ముఖ్య నిర్ణయాలను తీసుకుంటున్నారు. నాణ్యమైన నీటి కోసం అధునాతన ల్యాబ్ ద్వారా పరీక్షలు నిర్వహిస్తున్నారు. నాణ్యతతో కూడిన నీటిని ప్రతిరోజూ అందిస్తున్నారు. దీనిపై మోదీ స్పందించి ఇక్కడి నీటి పంపిణీ వ్యవస్థను కొనియాడటం బెజవాడకు గర్వకారణమని పలువురు పేర్కొన్నారు.

6

విదేశాల్లోని శిల్ప సంపదను రాజధానికి తెప్పించాలి

- కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు లేఖ
- రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి



మొక్క నాటుతున్న కలెక్టర్ లక్ష్మీశ (ఫైల్)

అమ్మ పేరుతో ఒక మొక్క

» మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందాం
» హరిత శోభకు విద్యార్థులకు గ్రీన్ పాస్‌పోర్టులు
» ఇప్పటివరకు 1.61 లక్షల మంది రిజిస్ట్రేషన్

(ఇబ్రహీంపట్నం, ఆంధ్రజ్యోతి)

మొక్కలు మానవాళిని ఎలా కాపాడుతాయో తెలుసుకునేలా చేయడంతో పాటు వారిని పర్యావరణంలో భాగస్వాములను చేసేందుకు చేపట్టిన బృహత్తర కార్యక్రమం గ్రీన్ పాస్‌పోర్టు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను దీనిలో భాగస్వాములు చేయనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఈ కార్యక్రమం మెగా పీటీఎం 2.0తో పురుడుపోసుకుంది. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ఈ పథకం కింద 1.61 లక్షల మంది పేర్లను నమోదు చేసుకున్నట్టు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ కొండపల్లి బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమ ముఖ్య



← గ్రీన్ పాస్‌పోర్టు

ఉద్దేశం పర్యావరణ పరిరక్షణ అని, పిల్లలకు మొక్కల పెంపకం పట్ల అవగాహన పెంచడం.. తద్వారా హరితశోభను తీసుకురావడమే ముఖ్య లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు.

● పర్యావరణ పరిరక్షణకు హరిత విస్తీర్ణం పెంచాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. దీనిలో విద్యార్థులను భాగస్వాములను చేయాల్సిన అవసరం ఉంది. చిన్ననాటి నుంచే పర్యావరణంపై పూర్తి అవగాహన కల్పించేందుకు గ్రీన్ పాస్‌పోర్టులు ఎంతో దోహదం చేస్తాయి. దీనిలో భాగంగా ఒక్కొక్క విద్యార్థి అమ్మ పేరున ఇంటి ఆవరణ, పొలాలు, పంట చెరువులు, ఇతర ప్రాంతాల్లో ఒక మొక్క నాటాలి. విద్యార్థి అలా నాటిన మొక్క ఆరోగ్య పరిస్థితికి అనుగుణంగా విద్యార్థికి పాయింట్స్ లభిస్తుంటాయి. విద్యార్థి నాటిన మొక్క పేరు దాని శాస్త్రీయ నామం, విద్యార్థి ఫొటోతో పూర్తి వివరాలు నమోదు చేస్తారు. మొక్కను ఆన్‌లైన్‌లో మానిటరింగ్ సైతం చేస్తారు. ప్రభుత్వ పాఠశాలల్లో 4వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థుల వరకు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. వారందరికీ గ్రీన్ పాస్‌పోర్టులను ఆయా పాఠశాలలకు పంపేందుకు విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టారు.

గతానికి భిన్నంగా

గతంలో వన మహోత్సవం పేరుతో పాఠశాలలు, పంచాయతీ కార్యాలయాల వద్ద పిల్లలకు మొక్కలు పంపిణీ చేశారు. అయితే వాటిపై పూర్తిగా పర్యవేక్షణ ఉండేది కాదు. అవి పెరిగితే పెరిగేవి లేకపోతే జీవాలు తినేయడం.. ఎండాకాలం వస్తే చనిపోయేవి. అయితే ఇప్పుడు అలా కాకుండా పెట్టిన మొక్క పూర్తిగా జీవించేలా మంచి ఫలాలు, నీడను ఇచ్చేలా ఉంచేందుకు ప్రభుత్వం మొక్కలను ఆన్‌లైన్ ద్వారా మానిటరింగ్ చేస్తుంది. ఈ పద్ధతి మంచి ఫలితాలను ఇస్తుందని అందరూ భావిస్తున్నారు.



కొండపల్లి బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినికి మొక్కను అందజేస్తున్న విద్యాశాఖాధికారి వీరాస్వామి



లండన్ మ్యూజియంలో శిల్పసంపదను తిలకిస్తున్న సీఎం చంద్రబాబు(ఫైల్)

విదేశాల్లోని శిల్ప సంపదను రాజధానికి తెప్పించాలి

» కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు లేఖ
» రాష్ట్ర పర్యాటక సాంస్కృతికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి



విజయవాడ, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : దేశవిదేశాల్లో ఉన్న అమరావతి అపురూప శిల్ప సంపద తిరిగి రాజధానికి తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూనుకుందని పర్యాటక సాంస్కృతికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ తెలిపారు. ఈమేరకు కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ కార్యదర్శికి ఆదివారం రాసిన లేఖలో ఆయన పేర్కొన్నారు. లండన్ మ్యూజియం, చెన్నై, ఢిల్లీ, కలకత్తా, హైదరాబద్ నుంచి రాష్ట్ర సంపదను తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అమరావతి కీర్తి ప్రపంచ దేశాలకు వ్యాపించడం గర్వించదగ్గ విషయమే అయినా, నవ్యాంధ్ర నిర్మాణం తర్వాత అంతటి గొప్ప సంపద రాష్ట్రంలో లేకపోవడం భావితరాలకు లోటని అన్నారు. దీని కోసం అమరావతి అభివృద్ధి కమిటీ ఛైర్మన్, అఖిల భారత పంచాయితీ పరిషత్(ఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షుడు ఎప్పటినుంచో కృషి చేస్తున్నారని ఆయన తెలిపారు. పది సంవత్సరాల జాన్సీ ప్రయత్నాలకు తాజాగా ప్రభుత్వం సహకారం కూడా తోడైందని అజయ్‌జైన్ పేర్కొన్నారు. "మన సంపదపై హక్కు దక్కే అవకాశం కనిపిస్తోంది. చెన్నై ఎగ్మోర్ మ్యూజియంలోనే అతి ముఖ్యమైన 500 శిల్పాలున్నాయి. కలకత్తా ఇండియన్ మ్యూజియం, ఢిల్లీ నేషనల్ మ్యూజియంలలో కూడా ఎంతో విలువైన అమరావతి ప్రాచీన శిల్పసందన ఉంది" అని ఆయన పేర్కొన్నారు. 1880కు ముందే బ్రిటీష్ వారు అమరావతి నుంచి మద్రాసుకు విలువైన శిల్పాలను తరలించుకుపోయారని అజయ్‌జైన్ చెప్పారు. లండన్‌లోని బ్రిటీష్ మ్యూజియంలో అమరావతి గ్యాలరీ నెంబర్ 33లో సుమారు 133 అతి ప్రాచీనమైన కళాఖండాలు ఉన్నాయన్నారు. వాటిని తెప్పించి 'మన సంపద మన అమరావతి రాజధాని'లో ఒక అంతర్జాతీయ మ్యూజియం ఏర్పాటుచేసి అందులో ప్రదర్శనగా ఉంచితే భావితరాలు చూసే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

బుద్ధుడి తలను తొలగించడం దుర్మార్గం

» ఆగస్టు 9న చలో మదనపల్లెకు ప్రజాసంఘాల పిలుపు

గాంధీనగర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : చిత్తూరు జిల్లా మదనపల్లె మండలంలో బుద్ధుడి విగ్రహ తలను తొలగించిన సంఘటనను ప్రజాసంఘాలు ఖండించాయి. తన సొంతజిల్లాలో జరిగిన ఈ సంఘటనపై సీఎం చంద్రబాబు ఇప్పటికీ స్పందించకపోవడాన్ని తప్పుబట్టాయి. ఆగస్టు 9న చలో మదనపల్లె పేరుతో 'ధమ్మ ర్యాలీ'తో బౌద్ధుల సత్తా చూపిస్తామని ప్రజాసంఘాల నేతలు హెచ్చరించారు. భారతీయ అంబేడ్కర్ సేన (బాస్) ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ప్రజాసంఘాల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ బౌద్ధ దేశాల సాయం కావాలి.. బౌద్ధుడి రక్షణ పట్టదా? అని ప్రశ్నించారు. జరిగిన సంఘటనకు నిరసన తెలిపిన బౌద్ధ అభిమానులపై తప్పుడు కేసులు నమోదు చేసి వేధింపులకు గురిచేస్తున్న అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బుద్ధుడి కొండపై బుద్ధుడి విగ్రహానికి కంచె ఏర్పాటు చేయడంపై మండిపడ్డారు. ఇది బౌద్ధుల ఆత్మగౌరవంపై దాడిగా అభివర్ణించారు.



కొండపర్వలో ప్రజలతో మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి

అర్హులందరికీ పక్కా గృహాలు

» మంత్రి పార్థసారథి

విస్సన్నపేట, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ త్వరలో పక్కా గృహాలు మంజూరు చేస్తామని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఆదివారం కొండపర్వలో ఎన్టీఆర్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కోర్టు పరిధిలో ఉన్న చింతలపూడి ఎత్తిపోతల పథకం ప్రాజెక్టును క్లియరెన్స్ రాగానే పనులు ప్రారంభిస్తామన్నారు. పిట్టలవారిగూడెం ఎత్తిపోతల పథకం విషయం కూడా ఆలోచిస్తామన్నారు. కొండపర్వలో రహదారులు నిర్మించాలని సామాజిక కార్యకర్త శివ సత్యనారాయణ మంత్రికి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రాయల సుబ్బారావు, మట్టా వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



వేదాద్రి, కంచల ఎత్తిపోతల పథకం

మంత్రిగారూ ఆదుకోరూ..

» నేడు నందిగామలో పయ్యావుల పర్యటన
» వేదాద్రి, కంచల ఎత్తిపోతల మరమ్మతులు జరిగేనా?
» నిధుల విడుదలపై అన్నదాతల ఎదురుచూపు

నందిగామ, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : వేలాది ఎకరాలకు సాగునీరందించే వేదాద్రి, కంచల ఎత్తిపోతల పథకాల మరమ్మతులకు ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారు. నిధులు ఇచ్చి అన్నదాతను ఆదుకోవాల్సిన బాధ్యత ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌పై ఉంది. మరమ్మతులకు రూ.15 కోట్లతో అంచనాలు రూపొందించిన ఏపీఎస్ఐడీసీ అధికారులు ఫైలును ఆర్థిక శాఖకు పంపారు. ఈ క్రమంలో మంత్రి పయ్యావుల 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా సోమవారం నందిగామలో పర్యటించనున్నారు. దీంతో ఆయకట్టు రైతుల్లో ఆసక్తి పెరిగింది. నిధులు విడుదల చేసి తమను ఆదుకుంటారని ఆశిస్తున్నారు. మంత్రి హోదాలో తొలిసారి నందిగామ వస్తున్న పయ్యావుల అన్నదాతలకు అండగా ఉండి ధైర్యం నింపుతారా.. లేక నిరాశ పరుస్తారా.. వేచి చూడాల్సి ఉంది.

నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాలకు చెందిన 17,500 ఎకరాల భూమికి సాగునీరందించే సంకల్పంతో గత తెలుగుదేశం ప్రభుత్వం వేదాద్రి, కంచల ఎత్తిపోతల పథకాలను నిర్మించింది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో 23 వందల అశ్వసామర్థ్యం గల నాలుగు మోటార్లతో ఈపథకాన్ని నిర్మించారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో ఈ తరహా పథకం లేదు. దీనికి ఏర్పాటు చేసిన మోటార్లు, పైప్‌లైన్లు, చివరకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కూడా వైవిధ్య భరితమైన వే. ఇంతటి శక్తి వంతమైన పథకం తెలుగుదేశం పాలనలో సమర్థవంతంగా పనిచేసి 250 క్యూసెక్కుల నీటిని నిరంతరాయంగా పొలాలకు అందించింది. సుమారు 125 మీటర్ల ఎత్తుకు నీటిని తోడిపోసి 430 మీటర్ల మేర పైప్‌లైన్ ద్వారా గ్రావిటీతో పంటలకు అందించిన ఈ పథకం నేడు మరమ్మతులకు గురై మూతపడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాటి నుంచీ పథకం మరమ్మతులు చేయిస్తారని అన్నదాతలు ఆశించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి నేపథ్యంలో గత ఏడాది పనులు చేపట్టలేదు. ఈఏడాది ఏప్రిల్ 5న పీ-4 కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలోని ముప్పాళ్లకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు పథకం స్థితిగతులు, ఆయకట్టు రైతుల ఆవేదనను ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య వివరించారు. దీంతో స్పందించిన ముఖ్యమంత్రి పథకం మరమ్మతులకు రూ.15 కోట్లు కేటాయిస్తున్నట్టు ప్రకటించారు. ఎట్టకేలకు రూ.15కోట్లకు అంచనాలు రూపొందించిన ఐడీసీ అధికారులు ఫైలును ఆర్థిక శాఖకు పంపేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే ఖరీఫ్ పనులు ప్రారంభమైన నేపథ్యంలో ఆర్థిక శాఖ త్వరితగతిన నిధులు కేటాయించి సహకరించాల్సి ఉంది. మరోవైపు రూ.21 కోట్ల మేర విద్యుత్ బకాయిలు పేరుకుపోయి ఉండటంతో సరఫరా నిలిపివేశారు. ఆ మొత్తాన్ని ఆర్థిక శాఖ భరించడమో.. లేక మాఫీ చేయడమో చేయాల్సి ఉంది. దీనికోసం ఆయకట్టు రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఈ తరుణంలో స్వయంగా ఆర్థిక మంత్రి ఇక్కడకు రావడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

వేదాద్రి రైతులకు తీపికబురు వచ్చేనా..!

వేదాద్రి, కంచల ఎత్తిపోతల పథకాల భవిష్యత్తు ప్రస్తుతం ఆర్థిక మంత్రి పయ్యావులపై ఆధారపడి ఉంది. ప్రత్యక్షంగా, పరోక్షంగా యాభైవేల మందికి ఆధారమైన ఈ పథకాలపై మంత్రి ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సిందే. మంత్రి రైతులకు తీపికబురు చెబుతారా.. లేదా వేచి చూడాల్సిందే.

గులకరాయి నిందితుడి ఆచూకీ కోసం

నాలుగు బృందాల గాలింపు

అజిత్‌సింగ్‌నగర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : గులకరాయి దాడి కేసు నిందితుడి [ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్] అదృశ్యంపై నగర పోలీసులు స్పందించారు. నాలుగు బృందాలు అతడి కోసం గాలిస్తున్నట్టుగా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికల సమయంలో జగన్మోహన్‌రెడ్డిపై రాయిదాడిలో నిందితుడిగా ఉన్న అజిత్‌సింగ్ నగర్ వడ్డెరకాలనీకి చెందిన వేముల సతీష్ ఈనెల 17 నుంచి కనిపించడం లేదు. సతీష్ అదృశ్యంపై 'ఆంధ్రజ్యోతి'లో ఆదివారం కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అజిత్‌సింగ్‌నగర్ సీఐ వెంకటేశ్వర్లు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. సతీష్ కొంత కాలంగా ఓ యువతితో ప్రేమలో ఉన్నాడని, సదరు విషయమై కుటుంబసభ్యులు ఇటీవల మందలించినట్టు తెలిసిందన్నారు. అదే యువతితో వెళ్లినట్టుగా సమాచారం ఉందని, ఈనెల 17న స్నేహితుడి వాహనంపై రైల్వేస్టేషన్‌లో దిగినట్టు సీసీ ఫుటేజీ ఆధారాలు లభించాయని అయితే అక్కడి నుంచి ఎటు వెళ్లాడనే విషయం తెలియాల్సి ఉందన్నారు. గుంటూరు, హైదరాబాద్, ఖమ్మం, విజయవాడల్లో నాలుగుబృందాలు గాలిస్తున్నాయని త్వరలోనే సతీష్ ఆచూకీ కనుగొంటామని పేర్కొన్నారు.

రాష్ట్ర గ్రంథాలయ కమిటీ సభ్యుడిగా వెనిగండ్ల



గుడివాడ, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర గ్రంథాలయ కమిటీ సభ్యుడిగా స్థానిక ఎమ్మెల్యే వెనిగండ్ల రామును నియమిస్తూ రాష్ట్ర శాసన వ్యవస్థ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్ సూర్యదేవర ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా వెనిగండ్లకు రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావు, నియోజకవర్గ పరిశీలకురాలు నూకాలమ్మ, మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, యలవర్తి శ్రీనవాసరావు, పిన్నమనేని బాబ్జీ తదితరులు అభినందనలు తెలిపారు.

ఎస్సీ సంక్షేమ కమిటీ ఛైర్మన్‌గా వర్ల



పామర్రు/ పెదపారుపూడి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ సంక్షేమ కమిటీ ఛైర్మన్‌గా స్థానిక ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా నియమితులయ్యారు. స్పీకర్ అయ్యన్న పాత్రుడు అధ్యక్షతన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేల సంయుక్త కమిటీలో ఎస్సీ సంక్షేమ కమిటీ ఛైర్మన్‌గా వర్లకు స్థానం కల్పించారు. కుమార్ రాజా నియామకం పట్ల పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు.



పతకాలు సాధించిన క్రీడాకారులతో కోచ్ నవీన్

ఈత పోటీల్లో పతకాలు

లబ్బీపేట(స్పోర్ట్స్), జూలై 27 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా జిల్లా మోడ్రన్ పెంటాథ్లాన్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన స్విమ్మింగ్ పోటీల్లో ఈడుపుగల్లు స్విమ్మింగ్‌పూల్ క్రీడాకారులు పతకాలు సాధించారు. అండర్ 13 బాలుర విభాగంలో రిత్విక్, అండర్ 11 బాలుర విభాగంలో జి.కృపా సాహిత్, విరాట్ కార్తికేయలు, బాలికల విభాగంలో ఎన్.నిహన్య, జి.సన్విత షారోన్‌లు పతకాలు సాధించారు. క్రీడాకారులను కోచ్ నవీన్ అభినందించారు. పతకాలు సాధించిన క్రీడాకారులు సెప్టెంబర్‌లో మహారాష్ట్రలో జరిగే నేషనల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని అయన తెలిపారు.

లంచావతారం!

(5వ పేజీ తరువాయి)

ఏ రోజుకారోజు డ్రాచేసి తనకు నగదు రూపంలో ఇవ్వాలని కోరినట్టు సమాచారం. ఇప్పటికే ముగ్గురు వ్యాపారులను ఈ తరహాలో వాడుకుంటున్నట్టు తెలిసింది. కొందరు వ్యాపారులు ఈ ప్రతిపాదనను విని తాము ఈ పనిచేయలేమని చెప్పి వచ్చేసినట్టు సమాచారం. ఇలాంటి ఎస్ఐను ఎక్కడా చూడలేదని వారు చెప్పుకోవడం గమనార్హం. స్టేషన్‌లో పనిచేసే ఒకరిద్దరు కానిస్టేబుళ్లు, ఒక హోంగార్డును తన చెప్పుచేతల్లో పెట్టుకున్న సదరు ఎస్ఐ తన అవినీతి వ్యవహారాలను చక్కబెడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

స్టేషన్ సిబ్బందిని బెదిరించి..

ఈ ఎస్ఐ చేస్తున్న అక్రమాలు, అవినీతి వ్యవహారాలను పైఅధికారులకు చేరవేస్తున్నారనే కారణంతో ఇటీవల స్టేషన్‌లో పనిచేస్తున్న సిబ్బందితో ఈ ఎస్ఐ గొడవకు దిగి బెదిరించినట్టు తెలిసింది. తాను తూర్పు గోదావరి జిల్లా నుంచి వచ్చానని, తనను ఎవ్వరూ ఏం చేయలేరని, మహా అయితే సస్పెండ్ అవుతానని, ఇది తనకేమీ కొత్త కాదని తనదైన శైలిలో స్టేషన్‌లోనే కేకలు వేయడం చర్చనీయాంశంగా మారింది.

రౌడీషీటర్ల నుంచి మామూళ్లు

స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీషీటర్లను అదుపు చేసి, వారి కదలికలపై నిఘా ఉంచాల్సిన ఈ అధికారి వారి నుంచి నెలనెలా మామూళ్లు వసూలు చేస్తున్నారని స్టేషన్ సిబ్బందే చెప్పుకుంటున్నారు. తాను అడిగినంత ఇవ్వకపోతే గంజాయి విక్రయిస్తున్నట్లుగా మీపై కేసులు నమోదు చేస్తానని బెదిరించడం గమనార్హం. ఈ స్టేషన్ పరిధిలో వారంలో ఒకరోజు జరిగే వ్యాపార నిమిత్తం వచ్చే వాహనాల సామర్థ్యాన్ని బట్టి, ఒక్కో వాహనం నుంచి రూ.3వేల నుంచి రూ.10 వేల వరకు నగదు వసూలు చేస్తుండటంతో స్థానిక వ్యాపారులు, వాహన యజమానులు ఈ ఎస్ఐ పేరు చెబితేనే వణికిపోతున్నారు. ఇటీవల కాలంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని కాకుండా, వేరే వాహనాన్ని స్టేషన్‌కు తరలించారు. సీసీ కెమెరాల ఫుటేజీలను సేకరించిన వాహన యజమాని ప్రమాదానికి కారణం తన వాహనం కాదని సాక్ష్యాలు చూపినా, వినకుండా పెద్ద మొత్తంలో అతని నుంచి నగదు వసూలు చేసి వాహనాన్ని విడిచిపెట్టడం, ఈ విషయం బయటకు పొక్కడంతో ఈ ఎస్ఐ పనితీరుపై స్థానికులు ఔరా అని ముక్కున వేలేసుకుంటున్నారు. స్టేషన్ పరిధిలో 25కుపైగా పంచాయతీలు ఉండగా, ఒక్కో పంచాయతీలో ఇద్దరేసి చొప్పున ఏజెంట్లుగా నియమించుకుని ఆయా గ్రామాల నుంచి ఏమైనా ఫిర్యాదులు వస్తే, తన ఏజెంట్ల ద్వారా తెరవెనుక బేరసారాలు నడిపి బాధితులు, నిందితుల నుంచి పెద్దమొత్తంలో నగదు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఇటీవల ఈ మండలానికి చెందిన కొందరు బాధితులు ఈ ఎస్ఐ తీరుపై నేరుగా ఉన్నతాధికారి వద్దకు వెళ్లి ఫిర్యాదు చేశారు. అయినా ఈ ఎస్ఐ పనితీరులో మార్పు రాకపోగా, మరింతగా వసూళ్లను వేగవంతం చేశారని ఉన్నతాధికారులు ఈ అధికారి తీరుపై విచారణ చేసి అదుపు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ముక్త్యాలకు పునరుజ్జీవం!

(5వ పేజీ తరువాయి)

పథకానికి నిధులు ఇవ్వాలని చంద్రబాబును కలిశారు. పది రోజుల క్రితం కూటమి ప్రభుత్వం రూ.489.28 కోట్లు మంజూరు చేస్తూ జీవో నెం.44ను ఇచ్చింది. ఈ ఎత్తిపోతల ద్వారా 38,627 ఎకరాల సాగర్ ఆయకట్టుకు సాగునీరు అందుతుంది. వేదాద్రి వద్ద నుంచి 386.27 క్యూసెక్కుల నీటిని రెండు దశల్లో ఎత్తి డీవీఆర్ కాల్వ ద్వారా మూడు చోట్ల ఎన్ఎస్పీ కాల్వలకు నీటిని విడుదల చేస్తారు. జగ్గయ్యపేట, వత్సవాయి, పెనుగంచిప్రోలు మండలాలలోని 30కి పైగా గ్రామాల రైతులకు లబ్ధి కలుగుతుంది.

పేరు మార్చి ఏమార్చిన వైసీపీ పాలకులు

గత వైసీపీ ప్రభుత్వంలో ముక్త్యాల ఎత్తిపోతల పేరు మార్చి పథకాన్ని ఏమార్చారని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య ఆరోపించారు. తిరిగి ముక్త్యాల ఎత్తిపోతలకు సీఎం చంద్రబాబును ఎంపీ కేశినేని శివనాథ్, కేడీసీసీ బ్యాంకు ఛైర్మన్ నెట్టెం రఘురాంల సహకారంతో ఒప్పించామని చెప్పారు. ఈ స్కీం నిర్మాణం వల్ల రైతులు ప్రతి ఏడాది సాగునీటి కోసం ఎదురు చూసే పరిస్థితి ఉండదని, ఎన్ఎస్పీ ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుందని, భావి తరాలకు నీటి భద్రత కలుగుతుందని వివరించారు. కేడీసీసీ బ్యాంకు ఛైర్మన్ నెట్టెం రఘురాం మాట్లాడుతూ ముక్త్యాల ఎత్తిపోతల పథకానికి నిధులు విడుదల చేసినందుకు హర్షం వ్యక్తం చేశారు. ఇంత పెద్ద మొత్తంలో రైతాంగ సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని నిధులు విడుదల చేసినందుకు చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎర్రకాల్వ సమస్యకు శాశ్వత పరిష్కారం

పట్టణంలో ఎర్రకాల్వ సమస్యకు శాశ్వత పరిష్కారానికి రూ.5.65 కోట్లు సీఎం మంజూరు చేశారని, ఈ నిధులతో పట్టణంలో ఎర్రకాల్వ ప్రవేశించే శాంతినగర్ నుంచి ఊర చెరువు వరకు కాల్వ లైనింగ్ పనులతో పాటు, అవసరమైన చోట కల్వర్టుల నిర్మిస్తామని ఎమ్మెల్యే తాతయ్య చెప్పారు. జగ్గయ్యపేట నియోజకవర్గానికి ప్రత్యేక శ్రద్ధతో నిధులు మంజూరు చేసిన సీఎం చంద్రబాబుకు ప్రజలు అందరి తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

గందరగోళం!

(5వ పేజీ తరువాయి)

సముదాయాలను పూర్తి చేసి సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చే ముందు గృహాలను లబ్ధిదారులకు అప్పగించారు. ఇక్కడ కేవలం పదిహేను మంది లబ్ధిదారులు కూడా గృహాల్లో నివాసం ఉండటం లేదు. ఈ లబ్ధిదారులు కూడా ఇంటి యజమానులు చనిపోవడం, బ్యాంకు రుణం తాము చెల్లించలేని స్థితిలో ఉన్నామనే ఇతరత్రా కారణాలతో గృహాలలోకి వెళ్లలేదు. గోసంఘంలో అన్ని బ్లాక్‌లలో ఖాళీగా ఉన్న గృహాలను స్వాధీనం చేసుకుంటామని మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ ప్రకటన విడుదల చేశారు.

రుద్రవరంలో పనులు పూర్తికాకుండానే..

మచిలీపట్నం నియోజకవర్గంలోని రుద్రవరంలో ముందుగా మూడు వేలకుపైగా టిడ్కో గృహాల నిర్మాణం కోసం పునాదులు వేశారు. వివిధ కారణాలతో ఈ గృహాల సంఖ్యను 1,440 కుదించారు. ఇక్కడి గృహాలకు సంబంధించి గదులకు కిటికీలు, డోర్‌లు, విద్యుదీకరణ పనులు ఇంకా జరుగుతూనే ఉన్నాయి. గృహాలకు విద్యుత్ మీటర్లు, ఇతరత్రా సామగ్రి బిగిస్తే దొంగలు వాటిని ఎత్తుకు పోయారు. వీటి స్థానంలో కొత్తవి ఇటీవల కాలంలో ఏర్పాటు చేశారు. కాంట్రాక్టర్‌కు రూ.5కోట్లకుపైగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. బిల్లులో కొంత మొత్తాన్ని మంజూరు చేస్తే పనులు పూర్తి చేస్తామని కాంట్రాక్టర్ చెబుతున్నాడు. పనులు పూర్తి కాకుండానే లబ్ధిదారులను పిలిచి, వారికి గృహాలను అప్పగించినట్లుగా ఇటీవల చూపారు. ఇక్కడ బి-5, బి-10, బి-11, బి-15, బి-22, సి-24, ఎ-5, ఎ-6, ఎ-8 గృహ సముదాయాలలో లబ్ధిదారులు నివాసం ఉండటం లేదని, ఆగస్టు 10వ తేదీలోగా వారు గృహాల్లోకి వెళ్లకపోతే ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే గృహాలను వేరే లబ్ధిదారులకు కేటాయిస్తామని, ఇదే ఆఖరు ప్రకటనగా భావించాలని ఆదేశాలు జారీ చేయడం గమనార్హం. ఇక్కడ రహదారులు, డ్రైనేజీల నిర్మాణం అస్తవ్యస్తంగానే ఉంది. ఈ గృహసముదాయాల్లో పనులు పూర్తికాకుండానే ఈ తరహా నోటీసులు జారీ చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తాగునీటి అవసరాల నిమిత్తం పైప్‌లైన్, ఓవర్‌హెడ్ ట్యాంకు, సంప్‌ల నిర్మాణ పనులు పూర్తయినా సగం గృహ సముదాయాలకు మాత్రమే పైప్‌లైన్ కనెక్షన్లు ఇచ్చి, మిగిలిన పనులను పెండింగ్‌లో పెట్టారు.

లులూకు భూ కేటాయింపు

(5వ పేజీ తరువాయి)

అభివృద్ధి చేస్తుంది. విజయవాడ పాతబస్టాండ్ స్థలం అత్యంత ఖరీదైన ప్రాంతంలో ఉంది. బందరు రోడ్డు, ఏలూరు రోడ్లు అనుసంధానమయ్యే ప్రాంతంలో పాతబస్టాండ్ ఉంది. ఆసియాలోనే రెండో అతిపెద్ద బస్‌స్టేషన్, దేశంలోనే రెండో అతి పెద్ద జంక్షన్ పాతబస్టాండ్ స్థలానికి కూతవేటు దూరంలో ఉంది. విజయవాడలో బీసెంట్ రోడ్డు, లెనిన్ సెంటర్ వంటి ఇతర అనేక కమర్షియల్ ప్రాంతాలకు అత్యంత దగ్గరగా ఇది ఉంటుంది. లులూ మాల్ ఏర్పాటుకు మూడేళ్ల సమయం పట్టే అవకాశం ఉంది.

మల్లవల్లి ఫుడ్‌పార్క్‌లో సీపీసీ నిర్వహణపై 'లులూ' ఆసక్తి

విజయవాడలో మెగా షాపింగ్ మాల్ నిర్మాణంతో పాటు కృష్ణాజిల్లా మల్లవల్లిలోని మెగా ఫుడ్ పార్క్‌లో కేంద్ర ప్రభుత్వ నిధులతో అభివృద్ధి పరిచిన సెంట్రల్ ప్రాసెసింగ్ సెంటర్ (సీపీసీ)ని కూడా లులు నిర్వహించటానికి ఆసక్తి చూపింది. ఇటీవలే 'లులు' ప్రతినిధులు సీపీసీని సందర్శించి వెళ్లారు. ఈ సీపీసీలో పల్స్ తయారీ, ప్యాకింగ్, కోల్డ్ స్టోరేజ్, టెట్రా ప్యాకింగ్ వంటి సదుపాయాలు ఉన్నాయి. విజయవాడలో ఇంటర్నేషనల్ షాపింగ్ మాల్‌ను నిర్మించ టంతో పాటు సీపీసీ నిర్వహణ బాధ్యతలు చూడనుంది.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై జగన్ తప్పుడు ప్రచారం



» ఎమ్మెల్యే కొలికపూడి విమర్శ

తిరువూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఆదాయం పెరిగింది కేవలం 3.47 శాతం అని ఒప్పుకుంటూ.. కేంద్రం నుంచి వచ్చే ఆదాయంతో కలిపితే పెరిగిన ఆదాయం 6.14 శాతం అని చెబుతూనే, మరోవైపు ఆర్థిక పరిస్థితిపై జగన్ విష పత్రికలో తప్పుడు ప్రచారం చేస్తుండటం ఆయన కుట్రపూరిత మనస్తత్వానికి నిదర్శనమని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు విమర్శించారు. ఆదివారం క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రానికి పెట్టుబడులు తేవడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు సింగపూర్ పర్యటనలో ఉండగా, జగన్ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై విష ప్రచారం చేస్తు, ప్రజల దృష్టి మరల్చే కుట్రకు పూనుకున్నారని ఆరోపించారు. ఏడాది కాలంగా అమరావతి నిర్మాణం, రాష్ట్ర ఆర్థిక పునర్నిర్మాణం, పోలవరం, తదితర ప్రాజెక్టుల నిర్మాణంపై ముఖ్యమంత్రి దృష్టి సారించారని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంతో జరుగుతుండటాన్ని ప్రజలు గమనిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. జగన్మోహన్‌రెడ్డి అసెంబ్లీకి వస్తే రాష్ట్ర అభివృద్ధిపై చర్చించుకోవచ్చని కొలికపూడి హితవు పలికారు.



సమావేశంలో మాట్లాడుతున్న విద్యాసాగర్

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

» ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్

గాంధీనగర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : మహిళా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్ తెలిపారు. గాంధీనగర్‌లోని ఎన్జీవో హోంలో ఆదివారం జరిగిన మహిళా విభాగం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘం ప్రతిష్ఠ పెంచేలా ప్రతీ ఒక్క సభ్యుడు కృషి చేయాలన్నారు. ఎన్జీవోలోని వివిధ శాఖల ఉద్యోగుల సంఘాల్లో మహిళా ఉద్యోగ సంఘం కీలకపాత్ర పోషించాలన్నారు. యువతరం మహిళా నాయకులను ప్రోత్సహించాలన్నారు. బకాయి డీఏలను వెంటనే విడుదల చేయాలని, పీఆర్సీ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న అధ్యయన ప్రక్రియను వేగవంతం చేయాలని మహిళా సంఘం చేసిన తీర్మానాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	232
చికెన్ స్కిన్‌లెస్	242

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 475

గన్నవరం వాకర్స్ అసోసియేషన్ సేవలు జిల్లాకే ఆదర్శం

గన్నవరం, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం వాకర్స్ అసోసియేషన్ చేస్తున్న సేవలు జిల్లాలోనే ఆదర్శమని వాకర్స్ అసోసియేషన్ జిల్లా గవర్నర్ ఎస్. సుబ్బారావు అన్నారు. ఆదివారం రాత్రి స్థానిక బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో వాకర్స్ అసోసియేషన్ విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రీడా మైదానంలో వాకర్స్ కోసం సుమారు రూ. 25 లక్షలతో అభివృద్ధి పనులు చేయడం అంటే సామాన్యమైన విషయం కాదన్నారు. మంచి సంకల్పం, పట్టుదల కలిగిన కె.వి.ఆర్ కిషోర్, బి. కోటేశ్వరరావు, ముక్కామల సుబ్బారావు లాంటి కార్యవర్గం ఉంటే ఏదైనా సాధించవచ్చు అని నిరూపించారని ఆయన కితాబిచ్చారు. వాకర్స్ అసోసియేషన్ సీనియర్లు యం. సుబ్బారావు, చిమటా రామారావు, బాబూరావు, రెడ్డి, ఎస్. శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం కెవిఆర్ కిషోర్, ముక్కామల సుబ్బారావులు ఒక్కొక్కరూ. 30 వేలు చెల్లించి సిల్వర్ డోనర్స్ గానూ, చిల్లపల్లి శ్రీనివాసరావు రూ. 10 వేలు చెల్లించి ఎంజీఎఫ్ మెంబర్‌గా చేరారు.

అడుగుకో మడుగు..!

- అధ్వానంగా తరిగొప్పుల-మానికొండ ప్రధాన రహదారి
- వర్షం వస్తే వాహనదారుల అవస్థలు
- తరచూ ప్రమాదాలు
- పట్టించుకోని పాలకులు
- ఇబ్బందిపడుతున్న స్థానికులు





అధ్వానంగా తరిగొప్పుల-మానికొండ ప్రధాన రహదారి.. బురదమయంగా సింగన్నగూడెం రహదారి

(ఉంగుటూరు / హనుమాన్‌జంక్షన్‌రూరల్ / కానూరు - ఆంధ్రజ్యోతి) : తరిగొప్పుల-మానికొండ ప్రధాన రహదారి అధ్వానంగా తయారైంది. సుమారు మూడు కిలోమీటర్ల మేర రోడ్డు గుంతలమయమై రూపురేఖలు కోల్పోవడంతో వాహనదారులు, ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. తరిగొప్పల రైల్వే గేటు దగ్గర నుంచి మానికొండ వరకు అడుగుకోగుంత దర్శనమిస్తూ రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. దీంతో గన్నవరం నుంచి గుడివాడ, ఉయ్యూరుకు నిత్యం రాకపోకలు సాగించే ఉద్యోగులు, వ్యాపారులు, విద్యార్థులు రహదారిలో వెళ్లలేక నానా తంటాలు పడుతున్నారు. చిన్నపాటి వర్షానికి కూడా రహదారిపై గోతుల్లో నీరుచేరి చెరువును తలపిస్తుండటంతో వాన నీటితో నిండిన గుంతలను అంచనావేయలేక పలువురు ద్విచక్రవాహనదారులు అదుపుతప్పి గోతుల్లో పడి గాయాలతో ఆస్పత్రి పాలవుతున్నారు. ఇక రాత్రివేళల్లో ఈ మార్గంలో వెళ్లాలంటేనే ప్రజలు జంకుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గన్నవరం-మానికొండ ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారికి మోక్షం లభించింది. తొలివిడతగా గన్నవరం, కేసరపల్లి, అజ్జంపూడి, బుద్ధవరం వరకు రోడ్డును అభివృద్ధిచేశారు. అనంతరం ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు చొరవతో బుద్ధవరం దాసులపాకనుంచి బూతిమిల్లిపాడు, తరిగొప్పల రైల్వేగేటు వరకు రోడ్డును అభివృద్ధిచేశారు. కాగా తరిగొప్పలనుంచి మానికొండ వరకు మిగిలిన మూడుకిలోమీటర్లమేర రహదారిని కూడా అభివృద్ధి చేయాలని ఆయాగ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదకరంగా ఎట్టివాగుపై లో లెవల్ వంతెన, రహదారి

వేలాది మంది ప్రజలు, రైతులు ప్రయాణించే సింగన్నగూడెం-మల్లవల్లి ప్రధాన రహదారిలో ఎట్టివాగుపై నిర్మించిన లోలెవల్ వంతెన ప్రమాదకరంగా తయారైంది. దీనికి తోడు ఇటీవల కురిసిన వర్షాలకు రహదారి గుంతలు పడి బురదయమంగా తయారై ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారింది. వీరవల్లి నుంచి వట్టిగుడిపాడు మీదుగా ఆగిరిపల్లి వెళ్లే ప్రధాన రహదారిపై 6వ కిలోమీటరు వద్ద గల ఎట్టివాగుపై లోలెవెల్ వంతెన గుంటలు పడి శిథిలావస్థకు చేరుకుంది. వంతెన మధ్యలో రహదారికి పడిన గుంట ప్రమాదకరంగా తయార వడంతో సింగన్నగూడెం గ్రామస్తులు రేడియం స్టిక్కర్లతో తయారు చేయబడిన (గ్రామం పేరు) బోర్డును అడ్డంగా పెట్టారు. వంతెన కూలిపోయేందుకు సిద్ధంగా ఉందని, మరమ్మతులైనా చేయాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవట్లేదని సింగన్నగూడెం, మల్లవల్లి, తదితర గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హనుమాన్‌జంక్షన్ నుంచి ఆగిరిపల్లి వెళ్లే ఆర్టీసీ బస్సు ఇదే రహదారిలో వెలుతుందని ప్రమాదం జరిగితే పరిస్థితి ఏమిటంటూ ప్రయాణి కులు ప్రశ్నిస్తున్నా సమాధానం చెప్పేవారు లేరు. అయిల్‌పామ్, చెరుకు లాంటి ఉత్పత్తులను ఇదే రహదారి గుండా ఫ్యాక్టరీలకు తరలిస్తామని వంతెన పడిపోతే సుమారు 12 కిలోమీటర్లు చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

కానూరులో రోడ్లు గుంతలమయం

తాడిగడప మున్సిపాలిటీలో అతి పెద్ద గ్రామమైన కానూరులో పలు అంతర్గత రహదారులు గుంతలమయంగా మారాయి. రోడ్లపై ఉన్న గుంతల్లో వర్షపునీరు చేరడంతో నడవడమే కష్టంగా ఉందని పలు కాలనీల వాసులు ఆరోపిస్తున్నారు. వాహన చోదకులైతే గోతుల్లో పడి గాయాలకు కూడా గురవుతున్నారు. ప్రతిరోజూ విద్యాసంస్థలకు వెళ్లే విద్యార్థులు ఈగోతుల వల్ల తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ చొరవ తీసుకొని కానూరులో అంతర్గత రహదారుల్లో ఉన్న గోతులను యుద్ధప్రతిపదికపై పూడ్చించాలని ప్రజలు కోరుతున్నారు.



తరిగొప్పల రైల్వే గేటు సమీపంలో ..





కానూరులోని పలు కాలనీల్లోని అంతర్గత రహదారులు



సైబర్ నేరాలపై స్థానికులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

చోడవరంలో పల్లెనిద్ర

పెనమలూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో లక్షలను దోచేస్తున్న కేటుగాళ్లు, గ్రామాల్లో రాత్రిళ్లు జరుగుతున్న అత్యాచారాలు, దోపిడీల పట్ల ప్రజలు పూర్తి అవగాహనతో ఉండాలని గన్నవరం డీఎస్పీ చలసాని శ్రీనివాసరావు ప్రజలకు సూచించారు. ఆదివారం మండలంలోని చోడవరం గ్రామంలో జరిగిన పల్లె నిద్ర కార్యక్రమంలో ఆయన పాల్గొని స్థానికులకు ప్రస్తుతం జరుగుతున్న నేరాల సరళి, నేరాల రకాలు, అప్రమత్తతపై అవగాహన కల్పించారు. పూర్తి స్థాయి అప్రమత్తతతోనే నేరాలు జరగకుండా చూడగలమని తెలిపారు. కృష్ణా కరకట్ట ప్రాంతం కావడంతో పొలం పనులకు వెళ్లిన మహిళలు పెందలకడనే ఇళ్లకు రావడం, అనుమానితుల పట్ల వెంటనే ఇళ్లలో పెద్దవాళ్లకు తెలియపరచడం లాంటి అప్రమత్తత ద్వారా నేరాలు జరగకుండా నివారించవచ్చని సీఐ జే వెంకటరమణ తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ఫిరోజ్, టీడీపీ నాయకులు మారుపూడి ధనకోటేశ్వరరావు, కోయ ఆనంద్‌ప్రసాద్, గ్రామ టీడీపీ అధ్యక్షుడు కలపాల శ్రీధర్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

కనిపించకుండా పోయిన విద్యార్థిని అప్పగింత

హనుమాన్‌జంక్షన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : కనిపించకుండా పోయిన విద్యార్థిని ఆచూకీ 36 గంటల్లో కనిపెట్టి అదుపులోకి తీసుకొని ఆమె కుటుంబ సభ్యులకు అప్పగించిన వైనం జంక్షన్ పీఎస్‌లో శనివారం రాత్రి చోటు చేసుకుంది. జంక్షన్-2 ఎస్సై ఎన్. లక్ష్మీనరసింహమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. తల్లి దండ్రులు లేని బాలిక కానుమోలులోని పెద్దమ్మ ఇంటి వద్ద ఉంటూ అదే గ్రామంలో 8వ తరగతి చదువుతోంది. పది రోజులుగా స్కూల్‌కు వెళ్లడం లేదు. ఆమె పెద్దమ్మ మందిలించింది. దీంతో బాలిక ఈ నెల 23న ఇంటి వద్ద నుంచి వెళ్లిపోయింది. బాలిక పెద్దమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ కేవీవీఎన్ సత్యనారాయణ పర్యవేక్షణలో సిబ్బందితో కలిసి ఎస్సై గాలించారు. ప్రకాశం జిల్లా పొదిలిలో ఉన్నట్టు గుర్తించి ఆమె పెద్దమ్మకు అప్పగించారు. జంక్షన్ పోలీసుల పనితీరును ఎస్పీ ప్రశంసించారు.

చదువుకు పేదరికం అడ్డు కారాదు

గన్నవరం, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : చదువుకు పేదరికం అడ్డుకా రాదని రిటైర్డ్ అధ్యాపకులు గన్నె వెంకట్రావు అన్నారు. స్థానిక ఎస్సీ కాలనీలోని పదవ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన తిరివీధి ప్రజ్వల్‌కు రూ.3వేలు, చదువుల కీర్తనకు రూ.2వేలు, తిరివీధి శశిధర్ రూ.వెయ్యి నగదు ప్రోత్సాహ కాలను మానవతా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం అందజేశారు. సంస్థ కన్వీనర్ కర్రా వరప్రసాద్, మదుపల్లి బాలకృష్ణ, వీసం ప్రసాదరావు, వివి కృష్ణమోహన్, ముక్కామల సుబ్బారావు, దేవరపల్లి విక్టర్‌బాబు, శ్రీకాకుళం సత్యనారాయణ, వడ్లమూడి వెంకటేశ్వరరావు, దేవరపల్లి ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.



జంక్షన్‌లో కాటాలను పరిశీలిస్తున్న ఏలూరు జిల్లా తూనికలు, కొలతల శాఖ అధికారి ప్రసాద్

తూకాల్లో మోసగిస్తే చర్యలు

హనుమాన్‌జంక్షన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : వినియోగదారులను తూకంలో మోసం చేస్తే చట్టం ప్రకారం చర్యలు తప్పవని ఏలూరు జిల్లా తూనికలు, కొలతల శాఖ అధికారి జి.ప్రసాద్ హెచ్చరించారు. ఆదివారం ఆయన స్థానిక నూజివీడు రోడ్డులోని మాంసం, నిత్యావసర వస్తువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తూకం కాటాలు, నిత్యావసర వస్తువుల సీలు ప్యాకెట్లను పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా కాటాలకు సీలు లేకండా వ్యాపారాలు సాగిస్తున్న ఇరువురికి రూ.2వేలు చొప్పున జరిమాన విధించారు. నిత్యావసర వస్తువులను అధిక ధరలకు విక్రయించిన, తూకంలో తేడా ఉన్నా ఏలూరులోని లీగల్ మెట్రాలజీ శాఖ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని ఆయన తెలిపారు.



పెదఓగిరాల ఉచిత వైద్యశిబిరంలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ జాన్‌డేవిడ్

200 మందికి వైద్యపరీక్షలు

ఉయ్యూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : హోప్ హాస్పిటల్ ఆధ్వర్యంలో పెదఓగిరాలలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించి 200మందికి వైద్యప రీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. హాస్పిటల్ అధినేత డాక్టర్ జాన్‌డేవిడ్, పిజీషియన్ డాక్టర్ మీనాకుమారి, గైనకాలజిస్టు డాక్టర్ సమీర, హాస్పిటల్ సిబ్బంది పాల్గొని వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా జాన్ డేవిడ్ మాట్లాడుతూ, సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని, పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత శుభ్రత పాటించాలని, వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎముకలు, కీళ్ల పటిష్టతకు తీసుకోవాలిసిన జాగ్రత్తలు సవివరంగా తెలియజేశారు.

అబ్దుల్ కలాం జీవితం యువతకు ఆదర్శం

టీడీపీ యువనేత బోడె వెంకట్రామ్, తాడిగడప మునిసిపల్ కమిషనర్ షేక్ నజీర్



తాడిగడప సెంటర్‌లో అబ్దుల్ కలాం విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న బోడె వెంకట్రామ్, షేక్ బుజ్జి

పెనమలూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : భారతరత్న, మాజీ రాష్ట్రపతి, మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జీవితం యువతకు ఆదర్శప్రాయమని టీడీపీ యువనేత బోడె వెంకట్రామ్, తాడిగడప మునిసిపల్ కమిషనర్ షేక్ నజీర్‌లు వ్యాఖ్యానించారు. ఆదివారం దివంగత అబ్దుల్ కలాం పదవ వర్ధంతి సందర్భంగా తాడిగడప సెంటరులో ఏర్పాటు చేసిన అబ్దుల్ కలాం విగ్రహాన్ని టీడీపీ నాయకులు షేక్ బుజ్జితో కలిసి ఆవిష్కరించి ఘన నివాళులర్పించి వారు మాట్లాడారు. దేశ అణు, శాస్త్రీయ రంగాలకు దిశానిర్దేశం చేసిన మహా మనిషి, మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం స్ఫూర్తితో యువత కలలు కనడం, వాటిని సాకారం చేసుకోవడం గురించి యువతకు చెప్పిన దార్శనికుడని కొనియాడారు. సాంకేతికత, విద్య, సమాజ సంక్షేమం కోసం అలుపెరగని కృషి చేసిన కలాం సేవలు భారతదేశ పురోగతికి మార్గదర్శనమౌతాయన్నారు. ఆయన జీవితం మనకు నిస్వార్థ సేవ, అంకిత భావం, దేశభక్తిలకు నిజమైన అర్థాన్ని తెలుపుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ కూటమి నాయకులు టీడీపీ రెహమాన్, తుమ్మల రామ్‌కుమార్, ఇనయతుల్లా, రియాజ్, ఇమాం తదితరులు పాల్గొన్నారు.



సుదిమళ్ల రవీంద్ర మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్

టీడీపీ నేత సుదిమళ్ల రవీంద్ర మృతి

కుటుంబసభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే బోడె, వైవీబీ

కంకిపాడు, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ మండల అధ్యక్షుడు సుదిమళ్ల రవీంద్ర ఆకస్మిక మృతి పార్టీకి తీరని లోటు అని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయాలపాలై కోలుకుంటున్న రవీంద్ర శనివారం రాత్రి మృతి చెందారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్ హుటాహుటిన రవీంద్ర నివాసానికి చేరుకొన్నారు. ఆదివారం తనకు ఉన్న పలు అభివృద్ధి కార్యక్రమాలను రద్దు చేశారు. ఉదయం నుంచి మృతదేహంతో పాటే ఉంటూ పోస్టుమార్టం అనంతరం భారీ ఊరేగింపుతో రవీంద్ర స్వగ్రామం జగన్నాథపురం తరలించారు. అక్కడ సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ, అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా పార్టీకి అండగా నిలిచారన్నారు. రవీంద్ర మృతదేహాన్ని సందర్శించి, కుటుంబ సభ్యులను పరామర్శించిన వారిలో వై.వి.బి రాజేంద్ర ప్రసాద్, దేవినేని రాజా, తుమ్మల చంద్రశేఖర్, తుమ్మలపల్లి హరికృష్ణ, పులి శ్రీనివాసరావు, యార్లగడ్డ రాజా, బత్తుల కామేశ్వరరావు, డీఎస్ఆర్, ఈడా కోటేశ్వరరావు, పావనమూర్తి, వణుకూరు విక్రం, కొండవీటి శివయ్య, బొర్రా వెంకట్ తదితరులు ఉన్నారు.

కొండాలమ్మను దర్శించుకున్న న్యాయాధికారి

గుడ్లవల్లేరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : వేమవరం కొండాలమ్మ అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. చిత్తూరు జిల్లా జడ్జి అరుణాసారిక దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆమెకు వేదమంత్రాలతో స్వాగతం పలికారు. అనంతరం సత్కరించి ప్రసాదం చిత్రపటాలను అందజేశారు. దాదాపు 20 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కులను చెల్లించుకున్నారని ఈవో ఆకుల కొండలరావు తెలిపారు.

ఘనంగా టీడీపీ నేత తుమ్మల జన్మదిన వేడుకలు



వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న తుమ్మల చంద్రశేఖర్

పెనమలూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ మాజీ చైర్మన్, టీడీపీ సీనియర్ నాయకులు తుమ్మల చంద్రశేఖర్ (బుడ్డి) జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ టీడీపీ నాయకులు, కార్యకర్తలు చంద్రశేఖర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని గంగూరు, గోసాల, పెనమలూరు తదితర ప్రాంతాల్లో తుమ్మల చంద్రశేఖర్ వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అంకెం రాజేష్, ఆకునూరు సుబ్బారావు, మెల్లమర్తి లక్ష్మీ, తోట బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యూరు: టీడీపీ నాయకుడు తుమ్మల చంద్రశేఖర్(బుడ్డియ్య) పుట్టిన రోజు వేడుక ఉయ్యూరులో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అభిమానులు సుందరయ్య నగర్‌లో కేక్ కట్‌చేసి ఆయన తరపున పేదలు, వృద్ధులు, దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. పలువురు అభిమానులు, కార్యకర్తలు పాల్గొని బుడ్డియ్యకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో కలశ పూజ



పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

పమిడిముక్కల, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : మంటాడ అలివేలు మంగ, పద్మావతి సమేత వైకుంఠ వెంకటేశ్వర స్వామి, శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రావణమాస ఆగమన వార్షికోత్సవాల్లో భాగంగా శనివారం మొదటి రోజు 108 కళాశాలతో అభిషేకాలు, పూజలు నిర్వహించారు. పమిడిముక్కల, ఉయ్యూరు మండలాల నుంచి భక్తులు పెద్దయెత్తున తరలివచ్చి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నసమారాధన చేశారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ఏ. రామమోహనరావు, ,ఈవో సీహెచ్ దుర్గా నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.


దిక్సూచి

సైబర్ సెక్యూరిటీ & సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ ఐఐటీ బాంబే సర్టిఫికెట్ ప్రోగ్రామ్

సైబర్ సెక్యూరిటీ & సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్‌పై ఐఐటీ బాంబే ప్రొఫెషనల్ సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది. పన్నెండు నెలల ఈ కోర్సును పూర్తిగా ఆన్‌లైన్‌లో అందిస్తున్నారు. పరీక్షలు ఐఐటీ క్యాంపస్‌లో నిర్వహిస్తారు. ఇది పూర్తిగా వర్కింగ్ ప్రొఫెషనల్స్, కాలేజీ ఫ్యాకల్టీలతోపాటు ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ విద్యార్థులను ఉద్దేశించి రూపొందించారు. 2025 సెప్టెంబర్ 1 నుంచి కోర్సు ప్రారంభం కానుంది. పూర్తి వివరాల కోసం ఐఐటీ బాంబే వెబ్‌సైట్ చూడవచ్చు.

ఐబీపీఎస్ పీవో, ఎస్ఓ దరఖాస్తుల గడువు జూలై 28

ప్రొబెషనరీ ఆఫీసర్, స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టుల దరఖాస్తు దాఖలు గడువును ఐబీపీఎస్ పొడిగించింది. ఆసక్తిగల అభ్యర్థులు 2025 జూలై 28లోపు ibps.in. వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.



ఎన్ఐఆర్‌డీలో పీజీ డిప్లొమా

హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ & పంచాయతీ రాజ్(ఎన్ఐఆర్‌డీపీఆర్)లో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ట్రైబల్ డెవలప్‌మెంట్ మేనేజ్‌మెంట్(పీజీడీటీడీఎమ్), ప్రోగ్రామ్‌లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి దూరవిద్యలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులను కోరుతున్నారు. మొత్తం మూడు సెమిస్టర్లు ఉంటాయి. మూడో సెమిస్టర్ పూర్తిగా ప్రాజెక్ట్ వర్క్ ఉంటుంది.

కోర్సు కాలవ్యవధి: 18 నెలలు
అర్హత: గుర్తింపు పొందిన వర్సిటీ నుంచి బ్యాచిలర్ డిగ్రీ పాసై ఉండాలి.
కోర్సు ఫీజు: రూ.18,200/-(ఎస్సీ/ఎస్టీలకు ఫీజులో కొంత మేరకు మినహాయింపు ఉంటుంది)
దరఖాస్తుకు చివరి తేదీ: జూలై 31
ఫోన్: 040 24008442, 7416860345,
Email: dec.nird@gov.in.
వెబ్‌సైట్: www.nirdpr.org.in

మ్యాట్ 2025 సెప్టెంబర్ సీజన్

సీబీటీ & పీబీటీ రిజిస్ట్రేషన్లు ప్రారంభం

ఆల్ ఇండియా మేనేజ్‌మెంట్ అసోసియేషన్ 'మ్యాట్ 2025' సెప్టెంబర్ సీజన్ కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది. జాతీయ స్థాయిలో మేనేజ్‌మెంట్ కోర్సుల్లో అడ్మిషన్లకు ఉద్దేశించిన ప్రధాన ఎంట్రెన్స్‌ల్లో 'ద మేనేజ్‌మెంట్ ఆప్టిట్యూడ్ టెస్ట్'(మ్యాట్) ఒకటి. ఈ ఎంట్రెన్స్‌ను 1988 నుంచి నిర్వహిస్తున్నారు. 2003 నుంచి కేంద్ర విద్యామంత్రిత్వశాఖ దీనిని జాతీయ స్థాయి పరీక్షగా గుర్తించింది. ఇది పేపర్ బేస్డ్ టెస్ట్(పీబీటీ), కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ) మోడల్‌లో ఉంటుంది. ప్రస్తుతం ఈ రెండు మోడల్స్‌కు సంబంధించిన రిజిస్ట్రేషన్లు ప్రారంభం అయ్యాయి. అభ్యర్థులు తమ సౌకర్యాన్ని, ఆసక్తినిబట్టి ఈ రెంటిలో ఒకటి కానీ, రెంటినీ కానీ ఎంచుకోవచ్చు. మ్యాట్ స్కోరు వ్యాలిడిటీ ఒక సంవత్సరం ఉంటుంది. దేశవ్యాప్తంగా 600 పైగా బిజినెస్ స్కూల్స్ ఈ స్కోరు ద్వారా అడ్మిషన్ కల్పిస్తాయి. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన విద్యార్థులు దీనికి దరఖాస్తు చేసుకోవచ్చు. గ్రాడ్యుయేషన్ చివరి సంవత్సరం ఉన్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేయవచ్చు. అయితే కౌన్సెలింగ్ సమయంలోపు సర్టిఫికెట్‌ను సమర్పించాల్సి ఉంటుంది.

పరీక్ష విధానం: మ్యాట్ ఎంట్రెన్స్ నిర్ణీత సమయం రెండు గంటలు. ఇందులో ఐదు సెక్షన్లు ఉంటాయి. ప్రతీ సెక్షన్‌లో ముప్పై ప్రశ్నలు అంటే మొత్తం 150 ప్రశ్నలు ఉంటాయి. ఈ ఎంట్రెన్స్‌లో నెగెటివ్ మార్కింగ్ ఉంది. తప్పుగా గుర్తించిన ప్రతీ సమాధానికి పావు మార్కు తగ్గిస్తారు.

- లాంగ్వేజ్ కాంప్రహెన్షన్ 30
- ఇంటెలిజెన్స్ అండ్ క్రిటికల్ రీజనింగ్ 30
- మేథమెటికల్ స్కిల్స్ 30
- డేటా అనాలిసిస్ అండ్ సఫిసియన్సీ 30
- ఎకనామిక్ అండ్ బిజినెస్ ఎన్విరాన్‌మెంట్ 30


పీబీటీ ఎగ్జామ్

- పరీక్ష తేదీ: 2025 సెప్టెంబర్ 21
- రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ: 2025 సెప్టెంబర్ 15
- హాల్ టికెట్ల విడుదల: 2025 సెప్టెంబర్ 18

సీబీటీ ఎగ్జామ్

- పరీక్ష తేదీ: 2025 సెప్టెంబర్ 28
- రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ: 2025 సెప్టెంబర్ 22
- హాల్ టికెట్ల విడుదల: 2025 సెప్టెంబర్ 25

ఫీజు: పీబీటీ లేదా సీబీటీల్లో ఏదో ఒకటే రాయాలనుకున్న అభ్యర్థులకు దరఖాస్తు ఫీజు రూ.2200/-. రెండు ఎంట్రెన్స్‌లు రాయాలనుకున్న అభ్యర్థులు అదనంగా రూ.1600/- చెల్లించాల్సి ఉంటుంది.
ఫలితాలు: 2025 అక్టోబర్ రెండోవారంలో విడుదల చేస్తారు.
వెబ్‌సైట్: mat.aima.in



ఆల్ ఇండియా లా ఎంట్రెన్స్ టెస్ట్ 2026

'ఆల్ ఇండియా లా ఎంట్రెన్స్ టెస్ట్ - 2026' నోటిఫికేషన్‌ను ఢిల్లీలోని 'ద నేషనల్ లా యూనివర్సిటీ' విడుదల చేసింది. ఐదు సంవత్సరాల బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్, బ్యాచిలర్ ఆఫ్ లా(బీఏ ఎల్ఎల్‌బీ)(ఆనర్స్), ఒక సంవత్సరం మాస్టర్ ఆఫ్ లా(ఎల్ఎల్ఎం) ప్రోగ్రామ్‌లకు సంబంధించిన ఈ ఎంట్రెన్స్ పరీక్ష 2025 డిసెంబర్ 14న జరుగుతుంది. ఢిల్లీలోని నేషనల్ లా యూనివర్సిటీలో అడ్మిషన్ కోసం ఏఐఎల్ఈటీ స్కోరును మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు. ('క్లాట్, 'ఎల్‌శాట్‌తో ఇక్కడ అడ్మిషన్ లభించదు).

విద్యార్హత: ఐదు సంవత్సరాల కోర్సుకు దరఖాస్తు చేయాలనుకునే అభ్యర్థులు కనీసం 45 శాతం మార్కులతో ఇంటర్‌మీడియేట్ పూర్తి చేసి ఉండాలి. ఓబీసీలకు 42, ఎస్సీ/ఎస్టీలకు 40 శాతం మార్కులు ఉంటే సరిపోతుంది.
వయస్సు: ఏఐఎల్ఈటీ ప్రోగ్రామ్‌లో చేరడానికి ఎలాంటి గరిష్ఠ, కనిష్ఠ వయస్సు నిబంధనలు లేవు.

పరీక్ష విధానం: మొత్తం మూడు సెక్షన్లతో 150 మార్కులు, 150 ప్రశ్నలతో ప్రశ్నపత్రం ఉంటుంది. నిర్ణీత సమయం రెండు గంటలు. ఇందులో నెగెటివ్ మార్కింగ్ ఉంటుంది. తప్పుగా గుర్తించిన ప్రతీ సమాధానానికి 0.25 మార్కులు తగ్గిస్తారు.
సెక్షన్ ఏ: ఇంగ్లిష్ లాంగ్వేజ్ - 50 మార్కులు - 50 ప్రశ్నలు
సెక్షన్ బి: కరెంట్ అఫైర్స్, జనరల్ నాలెడ్జ్ - 30 మార్కులు - 30 ప్రశ్నలు
సెక్షన్ సి: లాజికల్ రీజనింగ్ - 70 మార్కులు - 70 ప్రశ్నలు
దరఖాస్తు ఫీజు: జనరల్ అభ్యర్థులకు 3500/-. ఎస్సీ/ఎస్టీ, ఆర్థికంగా వెనకబడిన అభ్యర్థులకు 1500/-. 2025 ఆగస్ట్ 7 నుంచి 2025 నవంబర్ 10లోపు ఆసక్తి అర్హత కలిగిన అభ్యర్థులు ఏఐఎల్‌టీఈ 2026 కోసం nationallawuniversitydelhi.in వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవచ్చు. ఎంట్రెన్స్ పరీక్ష కేంద్రాలు తెలుగు రాష్ట్రాల్లోని హైదరాబాద్, విశాఖపట్నంలో ఉన్నాయి.
చిరునామా: National Law University, Delhi, Sector-14, Dwaraka, New Delhi - 110078, India, 011- 40787555
(10:00 am to 05:00 pm on all working days)
ailetsupport@nludelhi.ac.in

ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఉద్యోగాలు

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన ఏపీ ఫారెస్ట్ సబార్డినేట్ సర్వీస్‌లోని 100 ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. 2025 ఆగస్ట్ 17 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చు. రాత పరీక్ష, శారీరక పరీక్ష, సీపీటీ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఎన్‌సీసీ సర్టిఫికెట్ ఉన్నవారికి బోనస్ మార్కులు ఉంటాయి.

పోస్టు: ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్(ఎఫ్ఎస్ఓ). మొత్తం 100 పోస్టులు ఉన్నాయి.
వయస్సు: 2025 జూలై 1 నాటికి 18 నుంచి 30 సంవత్సరాల మధ్యలో ఉండాలి. రిజర్వేషన్లను అనుసరించి వయో పరిమితిలో సడలింపు ఉంటుంది.
అర్హత: పోస్టులను అనుసరించి డిగ్రీ ఉండాలి. (బోటనీ, ఫారెస్ట్రీ, హార్టికల్చర్, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథ్స్, స్టాటిస్టిక్స్, జియాలజీ, కెమికల్, మెకానికల్, సివిల్ ఇంజనీరింగ్)

శారీరక ప్రమాణాలు:

పురుషులు: కనీసం 163 సెంటీమీటర్ల ఎత్తు ఉండాలి. ఛాతి 84 సెంటీ మీటర్లు ఉండాలి. గాలి పీల్చినప్పుడు కనీసం ఐదు సెంటీమీటర్లు పెరగాలి.
స్త్రీలు: కనీసం 150 సెంటీ మీటర్ల ఎత్తు ఉండాలి. ఛాతి 79 సెంటీమీటర్లు ఉండాలి. గాలి పీల్చినప్పుడు 5 సెంటీ మీటర్లు పెరగాలి.
నడక: పురుషులు నాలుగు గంటల్లో 25 కిలో మీటర్లు నడవాలి. మహిళలు 16 కిలో మీటర్లు నడవాలి.
చివరి తేదీ: 2025 ఆగస్ట్ 17 **వెబ్‌సైట్:** portalpsc.ap.gov.in/

SCHOLARSHIP ALERT

Aspire Scholarship Program

Description: Aspire Scholarship Program 2025-26 is a CSR initiative of SWAYAM Charitable Trust, a not-for-profit organization set up by Mr. Ajai Chowdhry and his family. The scholarship aims to provide financial support to underprivileged students pursuing B.Tech courses at 11 prestigious engineering institutions across India.

Eligibility: Students joining the first year of B.Tech courses at any of the specified 11 institutions can apply.

- The annual family income of the applicants should not exceed INR 6 lakh from all sources.

Prizes & Rewards: A total of 28 beneficiaries will be awarded scholarships based on the actual fee structure.

- The scholarship fund will be provided for academic expenses such as tuition fees, hostel fees, food, and related expenses.
- The duration of the scholarship will be 4 years, subject to meeting the specified criteria for yearly renewal.

Last Date to Apply: 31-08-2025
Application: Online Only ***Short Url:*** www.b4s.in/aj/ASPI4

HDFC Bank Parivartan's ECSS Programme

Description: HDFC Bank invites applications from students in Classes 1 to postgraduate level for the ECSS Scholarship 2025-26. This program supports meritorious and underprivileged students from financially challenged backgrounds.

Eligibility: Open to Indian nationals only

- Students in Classes 1–12, diploma, ITI, polytechnic, undergraduate, and postgraduate (general and professional) courses
- Minimum 55% marks in the last qualifying exam
- Annual family income must be INR 2.5 lakh or less
- Preference for students who have faced personal or family crises in the past three years, affecting their ability to continue education

Prizes & Rewards: Up to INR 75,000 ***Last Date:*** 04-09-2025
Application: Online only ***Short Url:*** www.b4s.in/aj/HDFC57

buddy4study.com

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

'మైసా'గా రష్మిక



రష్మిక మందన్న కొత్త చిత్రం 'మైసా' ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సినిమాతో రవీంద్ర పుల్లె దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. నిర్మాత డి.సురేశ్ బాబు క్లాప్ కొట్టారు. రవి కిరణ్ కోలా కెమెరా స్విచ్చాన్ చేశారు. దర్శకుడు హను రాఘవపూడి స్క్రిప్ట్‌ను మేకర్స్‌కి అందజేసి, ముహూర్తపు షాట్‌కు గౌరవ దర్శకత్వం వహించారు. రష్మిక 'మైసా' అనే శక్తిమంతమైన, హీరోయిన్ ఓరియెంటెడ్ పాత్రలో కనిపించబోతున్నారు. కాగా, గోండు తెగల బ్యాక్‌డ్రాప్‌లో రూపుదిద్దుకోనున్న ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ సోమవారం నుంచి హైదరాబాద్‌లో ప్రారంభమవుతుందని, మొదటి షెడ్యూల్‌లో రష్మిక పాల్గొంటుందని చిత్రబృందం పేర్కొంది.

ఉత్కంఠభరిత చిత్రం



సమైరా, సముద్రఖని, అభిరామి ప్రధాన పాత్రల్లో అభినయ కృష్ణ దర్శకత్వంలో తెరకెక్కనున్న సినిమా 'కామాఖ్య'. పూజా కార్యక్రమాలతో ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. షై ఫిల్మ్ ప్రొడక్షన్స్ బేనర్‌పై వడ్డేపల్లి శ్రీ వాణీనాథ్, యశ్వంత్ రాజ్ నిర్మిస్తున్నారు. ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ ముహూర్తపు సన్నివేశానికి క్లాప్ కొట్టారు. చిత్ర దర్శకుడు అభినయ కృష్ణ ఈ సినిమా కోసం ఉత్కంఠభరితమైన కథని సిద్ధం చేశారని మేకర్స్ తెలిపారు. ఆనంద్, శరణ్య, ప్రదీప్, వైష్ణవ్, ధన్‌రాజ్, రాఘవ, ఐశ్వర్య తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

కొత్త పాత్రలో..



వరుణ్ సందేశ్ హీరోగా ఏ.పళని స్వామి తెరకెక్కించనున్న 'వన్ వే టికెట్' అనే సినిమా పూజా కార్యక్రమాలతో ఆదివారం ప్రారంభమైంది. బొరిగే శ్రీనివాస రావు నిర్మిస్తున్నారు. కార్యక్రమంలో నిర్మాత సి.కల్యాణ్, దర్శకుడు త్రినాధరావు నక్కిన, సంగీత దర్శకుడు సాయి కార్తిక్, నటి కుష్బూ చౌదరి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వరుణ్ సందేశ్ మాట్లాడుతూ 'ఈ స్క్రిప్ట్ చాలా డిఫరెంట్‌గా ఉంటుంది. నేను ఇందులో కొత్త పాత్రను పోషించబోతున్నాను' అని అన్నారు. చిత్ర దర్శకుడు పళని స్వామి మాట్లాడుతూ 'ఈ సినిమా క్రైమ్ థ్రిల్లర్‌గా రాబోతోంది' అని తెలిపారు. ఈ చిత్రానికి కెమెరామెన్: శ్రీనివాస్ బెజుగమ్, సంగీతం: సాయి కార్తీక్.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)



బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	232
చికెన్ స్కిన్‌లెస్	242

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 475

కొండాలమ్మను దర్శించుకున్న న్యాయాధికారి

గుడ్లవల్లేరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : వేమవరం కొండాలమ్మ అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అలానే అమ్మవారిని చిత్తూరు జిల్లా జడ్జి అరుణాసారిక దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆమెకు వేదమంత్రాలతో స్వాగతం పలికి విశేషపూజలు నిర్వహించి అనంతరం జడ్జిని సత్కరించి అమ్మవారి ప్రసాదం చిత్రపటాలను అందజేశారు. దాదాపు 20 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కులను చెల్లించుకున్నారని ఆలయ కార్యనిర్వాహణాధికారి ఆకుల కొండలరావు తెలిపారు



న్యాయాధికారి అరుణసారికకు అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న కొండలరావు

అధ్వాన రహదారులతో అవస్థలు

● ప్రయాణికులకు తప్పని సర్కస్ ఫీట్లు ● పట్టించుకోని అధికారులు

(ఆంధ్రజ్యోతి - పమిడిముక్కల) : వర్షంవస్తే బురద, ఎండ కాస్తే దుమ్ముతో కపిలేశ్వరపురం ప్రధారహదారి దుస్థితితో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. మండల కేంద్రంతో పాటు ఇతర గ్రామాలకు వెళ్లే వాహనాలు, ఇసుక క్వారీకి వెళ్లివచ్చే భారీవాహనాలతో అనునిత్యం రద్దీగా ఉండే ప్రధాన రహదారిని గత ప్రభుత్వ హయాంలో నిర్మించి మధ్యలో కొంతమేర అసంపూర్తిగా వదిలివేశారు. దీంతో గుంతల మయంగా తయారైన ఆప్రాంతంలో రహదారి వర్షం కురిసినప్పుడు బురదకయ్య, ఎండకాచి నప్పుడు దుమ్ములేచి రహదారికి ఇరువైపులా ఉన్న నివాసగృహాలలోకి వెళ్లి స్థానికులు అసౌకర్యానికి గురవుతున్నారు. అసంపూర్తిగా నిలిచిన రహదారి నిర్మాణం పూర్తిచేయాలని ఆప్రాంతంలో నివసిస్తున్న ప్రజలు అధికారులు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా ఫలితం లేదని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. వర్షం కురిసినప్పుడు గుంతల్లో నీరు నిలిచి బస్సులు, లారీలు, పెద్ద వాహనాలు వెళుతున్నపుడు బురద నీరు వచ్చిఇళ్లపైన పడుతుందని, ఎండకు దుమ్ములేచి ఇళ్లలోకి వస్తుందని ఆందోళన చెందుతున్నారు.

నిధుల కొరత ఉంది

కపిలేశ్వరపురంలో అసంపూర్తిగా ఉన్న రహదారి నిర్మాణం పూర్తిచేసేందుకు నిధుల కొ రత ఉంది. రహదారి నిర్మాణానికి అయ్యే ఖర్చు అంచనావేసి అవసరమైన నిధుల మంజూరు కోసం ఉన్నతాధికారులకు పంపించాము.

బలరామ్, ఆర్అండ్‌బీ డీఈ



కపిలేశ్వరపురంలో బురదకయ్యగా మారిన ప్రధాన రహదారి



భారీ వాహనాల తాకిడికి రోడ్డుపై తేలిన గులకరాళ్లు

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ రూరల్, జూలై 27(ఆంధ్రజ్యోతి) : ఏడాది పాలనలో రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని, నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. శనివారం రాత్రి గుడివాడ రూరల్ మండలం సిద్ధాంతం, శేరీ వేల్పూరు, శేరీదింటకుర్రు గ్రామాల్లో సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే వెనిగండ్ల ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెనిగండ్ల మాట్లాడుతూ కూటమి పాలనలో ప్రతి పేదవానికి సంక్షేమ ఫలాలను అందుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షులు వాసే మురళీ, గుడివాడ మార్కెట్ యార్డు ఛైర్మన్ చాట్రగడ్డ రవికుమార్, నాయకులు జగన్మోహనరావు, సూరపనేని చిన్నబాబు, తోకల క్రాంతి, కైలే రంజిత్‌కుమార్, కాశయ్య, ఏసుపాదం, తోట సురేష్, సురేంద్ర, వీరవరపు వంశీకృష్ణ, సుబ్బారావు, సురేష్, కోటి ముఖ్యం, కంచర్ల రవి, బుజ్జి, శ్రీను, మేడేపల్లి వెంకటేశ్వరరావు, మెండం వీర్రాజు, విజయ్, కోటేశ్వరరావు సురేష్‌కుమార్, ఆకునూరి నారాయణరావు, నరేష్, తెలుగు యువత, తెలుగు మహిళ, పార్టీ అనుబంధ విభాగాల నాయకులు ఆయా వార్డుల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

వాహనాల తనిఖీలు

పామర్రు, జూలై27(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాలపై ఉన్న పెండింగ్ చలానాలను చెల్లించి పోలీసులకు వాహనాదారులు సహకరించాలని ఎస్సై రాజేంద్రప్రసాద్ అన్నారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ఆదివారం సాయంత్రం ఎస్సై సత్యకళతో కలసి దిచక్రవాహనాల పెండింగ్ చలాన్లు తనిఖీ చేశారు.

ఆటోస్టాండ్ బోర్డు దిమ్మను తొలగించడం దారుణం

గుడివాడ : గత 26ఏళ్లగా ఉన్నఆటో స్టాండ్ బోర్డు దిమ్మను షాపు యజమాని కూల్చడం దారుణమని, ఆటో డ్రైవర్‌లందరూ తిరిగి ఆటో స్టాండ్‌ను ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌సీపీ రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక మార్వాడీ గుడి రోడ్డులో ఏర్పాటు చేసిన ఆటో స్టాండ్ బోర్డు, దిమ్మను ఆయన ప్రారంభించారు.

రైతులకు యూరియా అందుబాటులో ఉంచాలి

● రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు శివనాగేంద్రం

కూచిపూడి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా రైతులకు నేటి వరకు యూరియా అందుబాటులోకి రాకపోవటంతో వారు అవస్థలు పడుతున్నారని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు శివనాగేంద్ర పేర్కొన్నారు. చినముత్తేవిలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎరువుల దుకాణదారులు యూరియాకు కృత్రిమ కొరత సృష్టిస్తూ అధిక ధరలకు రూ.350లకు విక్రయిస్తున్నట్టు తెలిపారు. కాంప్లెక్స్, గుళికలు, ఇతర ఎరువులు కొంటేనే యూరియా అమ్ముతామని షరతులు విధిస్తున్నట్టు తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రాల్లోనూ, రైతు సేవా కేంద్రాల్లోనూ సబ్సిడీ ధరలకే ఎరువుల విక్రయించాలని డిమాండ్ చేశారు. విజిలెన్స్ వ్యవసాయ శాఖ అధికారులు ఎరువులు కొరత సృష్టిస్తున్న దుకాణదారులపై చర్యలు చేపట్టాలని, సజావుగా రైతులకు ఎరువులు విక్రయించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కౌలు రైతు సంఘ సహాయ కార్యదర్శి శీలం నారాయణరావు, కొడాలి కరుణాకర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శివనాగేంద్రం

జగనన్న కాలనీ అభివృద్ధి చేయాలి

● అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు నాగేశ్వరరావు

గుడివాడ, జూలై 27(ఆంధ్రజ్యోతి) : జగనన్న కాలనీ అభివృద్ధికి రూ.50కోట్లు నిధులను వెంటనే మంజూరు చేయాలని, మౌలిక వసతులను కల్పించాలని కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం మల్లాయిపాలెం శివారు జగనన్న కాలనీ మెయిన్ రోడ్డులో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షానికి కాలనీ మొత్తం మునిగిపోతుందని, కాలనీలో రహదారులు, డ్రెయిన్‌లు, మంచినీరు, వీధి దీపాలు, ఆసుపత్రి, పాఠశాలలు తదితర సౌకర్యాలను వెంటనే కల్పించాలన్నారు. కాలనీలో స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును అంగీకరించబోమని తేల్చి చెప్పారు. ఈ కార్యక్రమంలో కాలనీ అభివృద్ధి కార్యదర్శి కామేశ్వరీ, ఉపాధ్యక్షుడు షేక్ వలీ, సభ్యులు భాస్కరరావు, అనీల్, స్వాతిచ షేక్ కరీముల్లా, సయ్యద్ బాజీ, బాబురావు, తేజ, కృష్ణ పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు

'కొసరాజు' సేవలు మరువలేనివి

● మార్కెట్ కమిటీ ఛైర్మన్ రవికుమార్

గుడ్లవల్లేరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : మూడు దశాబ్దాలకు పైగా టీడీపీ మండల అధ్యక్షుడిగా మండలంలో పార్టీ కంచుకోటగా నిలవడానికి పునాదులు వేసిన మహానేత కొసరాజు వెంకటాద్రిచౌదరి (డాక్టర్ బాబు) అని గుడ్లవల్లేరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ పొట్లూరి రవికుమార్ అన్నారు. కొసరాజు వెంకటాద్రి చౌదరి సేవాసమితి నిర్వాహకుడు కొడాలి రామరాజు ఆధ్వర్యంలో ఆదివారం వెంకటాద్రిచౌదరి 70వ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని డాక్టర్ బాబు విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. అలానే ఎన్టీఆర్ విగ్రహానికి గుడివాడ మార్కెట్‌కమిటీ మాజీ ఛైర్మన్ వల్లభనేని వెంకట్రావు, జిల్లా పరిషత్ మాజీ వైస్ ఛైర్మన్ సాయిన పుష్పావతిలు పూలమాల వేసి నివాళులర్పించారు. కొడాలి రామరాజు, టీడీపీ మండల అధ్యక్షుడు కొసరాజు బాపయ్య చౌదరి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మోహనరావు, నీటి సంఘాల అధ్యక్షుడు చలసాని శ్రీధర్, సాయిన ప్రసాద్, బొప్పన శివప్రసాద్, తూము పద్మజ, వీరమాచనేని శివప్రసాద్, యెనిగళ్ల నాగేశ్వరరావు, శ్రీరామచంద్రప్రసాద్, ఈడే మోహన్, పత్తిబాబు, రంగబాబు, పి.రమేష్, ఎం.శ్రీను, పి.నరసింహారావు, స్వరూప్, మల్లా రామారావు, నరసింహారావు, డీసీ వైస్‌ఛైర్మన్ పోతురాజు పాల్గొన్నారు.



డాక్టర్‌బాబు విగ్రహానికి పూలమాల వేస్తున్న రవి

ప్లీనరీ సమావేశాలను జయప్రదం చేయాలి

● ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఎస్.సమరం

గుడివాడ, జూలై 27(ఆంధ్రజ్యోతి) : ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ సమావేశాలను ఈనెల 29, 30 తేదీల్లో నిర్వహించనున్నామని , వీటిని జయప్రదం చేయలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్.సమరం కోరారు. ఆదివారం స్థానిక సుందరయ్యభవన్‌లో ప్లీనరీ సమావేశాల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిగ్రీలో మేజర్, మైనర్ విధానం తీసుకురావడంతో డిగ్రీ వ్యవస్థ కుప్పకూలే ప్రమాదముందన్నారు. ఇంటర్‌షిప్ భారాన్ని కూడా విద్యార్థులపై మోపడంతో డిగ్రీలో విద్యార్థులు ప్రవేశాలు పొందకపోవడం, అడ్మిషన్లు ప్రారంభించలేక డిగ్రీ వ్యవస్థను ఏ విధంగా నిర్వీర్యం చేస్తుందో అర్థం చేసుకోవచ్చన్నారు. యువగళం పాదయాత్రలో జీవో నెం.77 రద్దు చేస్తామని నారా లోకేష్ ఇచ్చిన హామీని నిలబెట్టుకుని ఫీజు రీయంబర్స్‌మెంట్ కల్పించాలని డిమాండ్ చేశారు. , ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాలకు సౌకర్యాలను కల్పిస్తూ సొంత భవనాలను కేటాయించి ప్రారంభించాలని కోరారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు తల్లికి వందనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు జగన్, కార్యదర్శి నాగేంద్ర, కమిటీ సభ్యులు పవన్, సుధీర్, సాయి తదితరులు పాల్గొన్నారు.



ప్లీనరీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

శుభావతికి సత్కారం

గుడివాడ, జూలై 27(ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎన్‌జీవోస్ హోంలో ఆదివారం ఎన్‌జీవోస్ గుడివాడ తాలుకా యూనిట్, ఫ్రెండ్స్ ప్రోగ్రసివ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో ఫ్రంట్ కన్వీనర్ డీఆర్‌బీ ప్రసాద్ అధ్యక్షతన ఫ్లోరెన్స్ నైటింగల్ అవార్డు గ్రహీత శుభావతిని స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. రెడ్ క్రాస్ సోసైటీ జిల్లా కార్యదర్శి భవిరి శంకరనాథ్, ఎన్‌జీవోస్ సంఘ నాయకులు షేక్ ఫరీద్‌భాషా, జి.రాజేంద్రప్రసాద్, కొండపల్లి చందు, డాక్టర్ విజయ, జి.సత్యనారాయణ, నవభారత్ ఖాదీ స్టోర్స్ అధినేత సయ్యద్ గఫార్, తదితరులు పాల్గొన్నారు.



శుభావతిని సత్కరిస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

డీఆర్ బకాయిలను విడుదల చేయాలి

● జి.రామస్వామి

గుడివాడ, జూలై 27(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం డీఆర్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, అడిషనల్ క్వాంటమ్ పెన్షన్ గత విధానాన్ని కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు జి.రామస్వామి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఎన్‌జీవోస్ హోంలో సంఘం అధ్యక్షుడు భవిరి శంకర్‌నాథ్ అధ్యక్షతన రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం గుడివాడ శాఖ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యలను పరిష్కరించడానికి కృషిచేస్తామన్నారు. అనంతరం నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. సంఘ అధ్యక్షుడిగా భవిరి శంకర్‌నాథ్, ప్రధాన కార్యదర్శిగా వి.వి మురళీకృష్ణ, కోశాధికారి కొమరవోలు రామకృష్ణ, గౌరవాధ్యక్షుడిగా పెద్దిరెడ్డి సీతారామయ్య, అసోసియేట్ అధ్యక్షుడిగా బొమ్మదేవర సత్యనారాయణ, మహిళ కార్యదర్శిగా పొట్లూరు రమాదేవి, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా గుళ్లపల్లి ప్రభాకర్‌రావులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అంబటి వరప్రసాద్, ఖజానా అధికారి జ్యోతీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర పెన్షనర్ల సంఘం నూతన కార్యవర్గం

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

● డాక్టర్ లావణ్య

గుడివాడ, జూలై 27(ఆంధ్రజ్యోతి) : ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ లావణ్య పేర్కొన్నారు.ఆదివారం స్థానిక రాజేంద్రనగర్‌లోని జీవీ పూర్ణచంద్రరావు కమ్యూనిటీ హాల్‌లో రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వెరికోస్ వెయిన్స్ (ఉబ్బిన సిరలు) నిర్లక్ష్యం చేస్తే ప్రమాదకరమని, ప్రారంభ దశలో కలర్ డాప్లర్ టెస్ట్ ద్వారా గుర్తించి, చికిత్స అందిస్తే తగ్గుతుందన్నారు. ఈ శిబిరంలో 80మంది వైద్యపరీక్షలు చేయించుకోగా, వారిలో కొందరికి కలర్ డాప్లర్ టెస్ట్ చేసుకోవాలని సిఫారసుచేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు యలమంచిలి నాగేశ్వరరావు, కార్యదర్శి గుళ్లపల్లి కిరణ్‌బాబు, కౌన్సిలర్ గవిర్నేని బాబుశ్రీకర్, పూర్వ అధ్యక్షులు టి.ఎన్ రాజశేఖర్, ఎ.సుబ్రహ్మణ్యేశ్వరరావు, తిలక్, వెంకటేశ్వరరావు, శంకర్రావు, ప్రసాద్, సాగిరాజు ఉదయభాస్కరరాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు

రైలు ఢీకొని గుర్తుతెలియని మహిళ మృతి

గుడివాడ, జూలై 27(ఆంధ్రజ్యోతి) : గుడివాడ రైల్వేస్టేషన్ పరిధిలోని పుట్లచెరువు రైల్వేస్టేషన్ వద్ద రైలు బండి ఢీకొని గుర్తు తెలియని మహిళ మృతి చెందినట్టు రైల్వే స్టేషన్ ఎస్సై మహబూబ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మృతురాలి ఒంటిపై పసుపు, ఎరుపు డిజైన్ గల చీర, పసుపు జాకెట్ ధరించి ఉందని, మల్టీకలర్ క్లాత్ రగ్గు ఉన్నట్లు తెలిపారు. వయస్సు సుమారు 60సంవత్సరాలు ఉంటుందని, మృతురాలి వివరాల తెలిస్తే గుడివాడ రైల్వే స్టేషన్‌లో లేదా సెల్ నెం. 94406 27570, 99890 29379కు సమాచారం అందించాలని ఎస్సై కోరారు.

అంగన్వాడీ కేంద్రానికి మరమ్మతులు

పమిడిముక్కల : పెనుముత్సలో అధ్వాన స్థితిలో ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని పెనుముత్స గ్రామ సర్వీస్ ట్రస్టు ఆధ్వర్యంలో రూ. 40వేల ఖర్చుతో మరమ్మతులు, రంగులు వేయించి సుందరంగా తీర్చిదిద్దారు. తలుపుల మెస్ డోర్లు, కిటికీలకు మెస్, బాత్రూమ్ డోరు, ఇతర మరమ్మతులు చేయించి , కుంగిన ఫ్లోరింగ్ పనులు చేయించారు. ట్రస్టునిర్వాహకులకు అంగన్వాడీ టీచర్ జ్యోతి, పిల్లల తలితండ్రులు ధన్యవాదములు తెలిపారు. కుమార్, నాగరాజు, నాంచారయ్య, కోటేశ్వరరావు, కుటుంబరావు సేవలందించారు.

ఆటోడ్రైవర్ నిజాయితీ

గుడివాడ : స్థానిక నాగవరప్పాడుకు చెందిన ఆట్రోడ్రైవర్ డి.దాసుకు శనివారం రాత్రి రైల్వేస్టేషన్ రోడ్డులో రహదారిపై పడి ఉన్న సెల్‌ఫోన్ దొరికింది. నిజాయితీని చాటుకుంటూ స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో సెల్‌ఫోన్‌ను అందజేశాడు. అదే సమయంలో సెల్‌ఫోన్ వ్యక్తి ఫోన్ చేయడంతో ఫోన్ టూటౌన్‌లో అందజేసినట్లు డ్రైవర్ దాసు తెలిపారు. సదరు వ్యక్తి స్టేషన్‌కు వచ్చి ఆధారాలు సమర్పించడంతో సీఐ హనీష్ సెల్‌ఫోన్‌ను శనివారం రాత్రి అప్పగించారు. నిజాయితీగా దొరికిన సెల్‌ఫోన్‌ను అందజేసిన ఆటో డ్రైవర్‌ను సీఐ హనీష్ అభినందించారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో కలశ పూజ

పమిడిముక్కల, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : మంటాడ అలివేలు మంగ, పద్మావతి సమేత వైకుంఠ వెంకటేశ్వర స్వామి, శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రావణమాస ఆగమన వార్షికోత్సవాల్లో భాగంగా శనివారం మొదటి రోజు 108 కళాశాలతో అభిషేకాలు, పూజలు నిర్వహించారు. పమిడిముక్కల, ఉయ్యూరు మండలాల నుంచి భక్తులు పెద్దయెత్తున తరలివచ్చి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నసమారాధన చేశారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ఏ. రామమోహనరావు, ,ఈవో సీహెచ్ దుర్గా నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

గుడివాడ : స్థానిక పాటిమీద వేంచేసియున్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆండాళ్ అమ్మవారి తిరునక్షత్ర కార్యక్రమంలో భాగంగా ఆదివారం దేవస్థాన అర్చకులు వేదాంతం అప్పలాచారి ఆధ్వర్యంలో ఆండాళ్ అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి కందుల వేణుగోపాలరావు, ధర్మకర్తల మండలి మాజీ అధ్యక్షుడు ఇందిరా రమణరావు పాల్గొన్నారు.



మంటాడలో 108 కలశాలతో పూజ చేస్తున్న అర్చకులు

రహదారులు చెరువులయ్యాయి..



చింతలగుంటలో..

గుడ్లవల్లేరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : జేమ్సుపేట- చినగొన్నూరు ప్రధాన రహదారి కొద్దిపాటి వర్షానికే బురదకయ్యగా మారుతోంది. చింతలగుంట, కట్టానిచెరువు, తాడిచర్ల, పురిటిపాడు, చినగొన్నూరు ఈ గ్రామాల ప్రజలకు గుడ్లవల్లేరు, గుడివాడ, ముదినేపల్లిలో జీవనం కోసం, చదువుల కోసం నిత్యం ఈ రహదారిలో వందలాది వాహనాలలో ప్రయాణం చేస్తుంటారు. అయితే ఏడాది క్రిందటే ఈ రహదారి నిర్మాణానికి రూ80 లక్షలు ఆర్అండ్‌బీ నుంచి నిధులు మంజూరై టెండరు ప్రక్రియ పూర్తయ్యి కాంట్రాక్టరుకు వర్క్ ఆర్డర్ ఇచ్చినప్పటికీ రహదారి నిర్మాణ పనులు ప్రారంభింకపోవడంపై ఆ గ్రామాల ప్రజలు మండిపడుతున్నారు. ఈ క్రమంలో జిల్లా పరిషత్ మాజీ వైస్‌ఛైర్మన్ సాయిన పుష్పావతి, నీటిసంఘం అధ్యక్షలు సాయిన ప్రసాద్‌లు గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, మచిలీపట్నం పార్లమెంటు సభ్యుడు వల్లభనేని బాలశౌరిల దృష్టికి తీసుకు వెళ్లగా నిర్మాణ ప్రక్రయ ప్రాంభించేవిధంగా మాట్లాతామని చెప్పారు.



కట్టానిచెరువు గ్రామంలో..

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	232
చికెన్ స్కిన్‌లెస్	242

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 475

పెడన మున్సిపల్ మాస్టర్ ప్లాన్‌కు ప్రభుత్వ ఆమోదం

పెడన, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : పెడన మునిసిపాలిటీ మాస్టర్ ప్లాన్‌ను ప్రభుత్వం ఆమోదించింది. మునిసిపల్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టర్ కార్యాలయం రూపొందించిన ప్లాన్ ఆమోదిస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ జీవో నెంబర్ 132ను జారీ చేశారు. ఈ మాస్టర్ ప్లాన్ 1287 హెక్టార్ల విస్తీర్ణంలోని మునిసిపల్ ఏరియాలో 2041వ సంవత్సరం వరకు అమలులో ఉంటుంది. ఈ ప్లాన్‌కు ఆమోదం లభించడంతో పాటు పట్టణ పరిధిలోని రోడ్లు విస్తరించనున్నాయి. ఈ మాస్టర్ ప్లాన్‌లో మచిలీపట్నం - గుడివాడ రోడ్డు 150 అడుగుల మేర, పెడన - బంటుమిల్లి రోడ్డు 150 అడుగుల మేర, పెడన - గూడూరు రోడ్డు 80 అడుగుల మేర, 216 జాతీయ రహదారి 200 అడుగుల మేర విస్తరించాలని ప్రతిపాదించారు.

గ్రామీణ రోడ్లు - సర్కస్ ఫీట్లు

● పెద్దపెద్ద గోతులు, బురదకయ్యలు
● ప్రమాదాల బారిన ప్రజలు



చల్లపల్లి - నడకుదురు మార్గంలో టీచర్స్ కాలనీ మలుపులో బురదకయ్యగా మారిన ప్రధాన రహదారి

చల్లపల్లి - నడకుదురు ప్రధాన రహదారి
పెద్దపెద్ద గోతులతో, బురదతో ప్రమాదకరంగా మారింది. చల్లపల్లి ఎన్టీఆర్ పార్కు నుంచి కిలోమీటరు మేర, టీచర్స్ కాలనీ మలుపులో గోతుల్లో నీరు నిలిచి బురదకయ్యగా ఉంది. వాహనదారులు సర్కస్ ఫీట్లు చేయాల్సి వస్తోంది. కనీసం భారీ గోతులనైనా పూడ్చి వాహనదారులకు అసౌకర్యం లేకుండా చేయాలని ప్రజలు కోరుతున్నారు.
(చల్లపల్లి-ఆంధ్రజ్యోతి)

నడుపూరు-కొత్తపల్లి
ప్రధాన రహదారి మండలంలోని 15 గ్రామాలకు అనుసంధానమై ఉంది. ఈ మార్గంలో లంకలకలవగుంట-ఉరివి మధ్య రోడ్డు బురదకయ్యగా మారింది. పెద్ద పెద్ద గోతుల్లో నీళ్లు నిలిచి ఈ మార్గంలో వెళ్లే ప్రజలు సర్కస్ ఫీట్లు చేస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఉరివి నుంచి ప్రజలు పెడనకు చెన్నూరు లేదా కంచడం మీదుగా రావాల్సి వస్తోంది. రోడ్డును తక్షణం అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.
(పెడన రూరల్ - ఆంధ్రజ్యోతి)



నడుపూరు-కొత్తపల్లి మార్గంలో లంకలకలవగుంట వద్ద బురదకయ్యగా మారిన రోడ్డు



అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు

మోపిదేవి, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని టీడీపీ నాయకులు అన్నారు. పెదప్రోలు పంచాయతీ శివారు నెహ్రూనగర్‌లో ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. టీడీపీ మండల అధ్యక్షుడు నడకుదుటి జనార్ధనరావు, టీడీపీ నాయకులు బొబ్బా గోవర్ధన్, నాదెండ్ల రాజేష్, నాదెండ్ల శరత్ చంద్ర ప్రసాద్, కేసన సురేష్, మోర్ల జయలక్ష్మి, దివి యుగంధరి, మాతంగి వెంకటేశ్వరమ్మ, రావి రత్నగిరి, బాలకోటేశ్వరరావు, మేడికొండ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

అవనిగడ్డలో సుపరిపాలనలో తొలి అడుగు

అవనిగడ్డ, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : అవనిగడ్డలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం ఆదివారం జరిగింది. దివి మార్కెట్ కమిటీ ఛైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, మండల ప్రోగ్రామ్ కన్వీనర్ కర్రా సుధాకర్ నేతృత్వంలో ఎనిమిదో వార్డులో ప్రజలను కలిసి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. పరుచూరి దుర్గా ప్రసాద్, బండే రాఘవ, షేక్ బాబావలి, మండలి రామ్మోహనరావు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. అవనిగడ్డ 7వ వార్డులో టీడీపీ మండల అధ్యక్షుడుయాసం చిట్టిబాబు ఆధ్వర్యంలో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీ నేతలు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు.

పోతిరెడ్డిపాలెంలో

మచిలీపట్నం టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : బందరు మండలం పోతిరెడ్డిపాలెంలో ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. క్లస్టర్ కన్వీనర్ తలారి సోమశేఖర్, కో కన్వీనర్ కె.పి. రామస్వామి, మేకా గంగాధరరావు, కాగిత శేషు, కాగిత రవికుమార్, మట్టా గణపతి, భోగిరెడ్డి వెంకన్నబాబు, కూడూరి నాగశివ, కొండేటి అర్జునరావు, జన్ను వీరవెంకట సుబ్బారావు, మోర్ల వెంకటేశ్వరరావు, కాసాని విష్ణు, కాసాని రవికుమార్ తదితరులు ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలు వివరించారు.



ఉపాధ్యాయులను సత్కరించి ఆత్మీయ సమ్మేళనంలో మధుర స్మృతులను పంచుకున్న కొడాలి జడ్పీ పాఠశాల 1981-82 బ్యాచ్ విద్యార్థులు

కొడాలి జడ్పీ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఘంటసాల, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : కొడాలి జడ్పీ పాఠశాలకు 1981-82 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. వివిధ రంగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు 45 సంవత్సరాల తర్వాత కలుసుకోవటంతో ఆనందానికి అవధుల్లేకుండాపోయింది. మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలుకరించుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పాఠశాలలో సందడి చేశారు. నాటి ప్రధానోపాధ్యాయుడు దివంగత జె.సూర్యనారాయణమూర్తి చిత్రపటానికి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు చింతలపాటి లక్ష్మీపతి శాస్త్రి, నాదెళ్ల వెంకట గోపాలరావు, ఎస్.అబ్రహం, యోబు, నాంచారమ్మ, వేములపల్లి రాజేంద్ర ప్రసాద్, అద్దంకి బాబురావు, ప్రస్తుత ప్రధానోపాధ్యాయుడు పోతన లక్ష్మేశ్వరరావులను ఘనంగా సత్కరించారు. పాఠశాల అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు. పూర్వ విద్యార్థుల సమావేశాన్ని కోటప్రోలు నాంచారయ్య, గుమ్మడి ధాన్యారాణి, వేమూరి బాలకృష్ణ, కంఠమనేని శేషు, వేమూరి వకుళ, కంఠమనేని రమణ, బి.సురేంద్ర తదితరులు నిర్వహించారు.

హిందూ కళాశాల విశ్రాంత అధ్యాపకుడు మౌలానా మహమ్మద్ సనావుల్లా ఉమ్రి మృతి



మచిలీపట్నం టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : ఆధ్యాత్మికవేత్త, హిందూ కళాశాల విశ్రాంత ఇంగ్లీషు అధ్యాపకుడు మౌలానా మహమ్మద్ సనావుల్లా ఉమ్రి (85) ఆదివారం తెల్లవారుజామున మృతి చెందారు. పరాసుపేటలోని ఆయన స్వగృహంలో గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు.

సనావుల్లా ఉమ్రి మృతికి అబ్దుల్ మతీన్ తదితరులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.



అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆటల పోటీలను ప్రారంభించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

అవనిగడ్డ, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. అవనిగడ్డ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ పాఠశాలల క్రీడా ప్రాంగణంలో విజ్ఞాన విహార్, విజయవాడ సమితి ఆధ్వర్యంలో ఆటల పోటీలను నిర్వహించారు. పోటీలను బుద్ధప్రసాద్ ప్రారంభించి మాట్లాడారు. జిల్లా అగ్నిమాపక అధికారి సుధాకర్ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేయగా, విజ్ఞాన విహార్‌విజయవాడ సమితి 13 పాఠశాలల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ నాగ సూర్యతేజ వ్యాయామోపాధ్యాయులు పోటీలను పర్యవేక్షించారు.

మురళీకృష్ణకు టీడీపీ నేతల సత్కారం



మురళీకృష్ణను సత్కరిస్తున్న సుభాష్ చంద్రబోస్, టీడీపీ నేతలు

ఘంటసాల, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : తాడేపల్లి గ్రామానికి చెందిన చింతా వెంకట మురళీకృష్ణ ఇటీవల విశాఖపట్నం గీతం యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. ఆగిరిపల్లిలోని ఎన్‌ఆర్‌ఐకళాశాలలో డేటా సైన్స్ హెచ్‌వోడీగా పని చేస్తున్న మురళీకృష్ణను డాక్టరేట్ లభించిన సందర్భంగా పరుచూరి సుభాష్ చంద్రబోస్ ఆధ్వర్యంలో టీడీపీ నేతలు ఘనంగా సత్కరించారు. టీడీపీ నేతలు యార్లగడ్డ వీరభద్రరావు, సూరపనేని శివరామ ప్రసాద్, కొడాలి లక్ష్మణ్, మొవ్వ శ్రీరామ్మూర్తి, మొవ్వ కోటేశ్వరరావు, కిషోర్, మల్లిపెద్ది వీరయ్య, కాట్రగడ్డ వేణుగోపాల్ తదితరులు పాల్గొని అభినందించారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి : ఐక్యవేదిక

బంటుమిల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : స్మార్ట్ మీటర్లు పేదలకు భారంగా తయారవుతాయని, వాటి ఏర్పాటును విరమించాలని, ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని ప్రజా సంఘాల ఐక్య వేదిక నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక గుండా బత్తుల ఆంజనేయులు స్మారక భవనంలో ఆదివారం ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. కృష్ణా, గుంటూరు జిల్లాల ఎల్ఐసీ యూనియన్ ప్రధాన కార్యదర్శి జి.కిషోర్‌కుమార్ మాట్లాడుతూ ఆదాని స్మార్ట్ మీటర్లు డబ్బుపెట్టి రీచార్జ్ చేయించుకోవాలని, ఎప్పుడు డబ్బులు అయిపోతే అప్పుడే కరెంటు కట్ అవుతుందన్నారు. రోజుని నాలుగు భాగాలుగా విభజించి కరెంట్ ఎక్కువగా వాడే టైమ్‌లో ఎక్కువ రేటు వేసే విధంగా మీటర్లు ఉన్నాయన్నారు. ఉచితంగా స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నామని చెపుతున్న ప్రభుత్వం ప్రజలపై అధిక భారం మోపుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదాని మీటర్లకు ప్రభుత్వ విద్యుత్ మీటర్లకు సంబంధం లేదన్నారు. ప్రజలందరూ వీటిని వ్యతిరేకించాలని ఆయన పిలుపునిచ్చారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.



దీర్ఘకాలిక రోగాలకు ఆయుర్వేదం అద్భుతమే

మచిలీపట్నం టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : దీర్ఘకాలిక వ్యాధులకు ఆయుర్వేదం అద్భుతంగా పనిచేస్తుందని శుభకర ఆయుర్వేద వైద్యశాల అధినేత డాక్టర్ జి.రంగనాథ్ అన్నారు. ఉదయపు నడక మిత్ర మండలి ఆధ్వర్యంలో ఆదివారం గాంధీనగర్‌లోని వాకర్స్ భవనంలో జరిగిన సమావేశంలో డాక్టర్ రంగనాథ్ కేరళీయ పంచకర్మ వైద్యంపై ప్రసంగించారు. ఫైల్స్ ఫిస్టులా వ్యాధులకు శస్త్ర చికిత్స లేకుండా ఆయుర్వేదం ద్వారా నివారించవచ్చన్నారు. అధిక రక్తపోటు, మధుమేహం, గుండెజబ్బుల నివారణకు ఏ విధమైన ముందస్తు జాగ్రత్త చర్యలు, స్థూలకాయం వల్ల పెరిగే అనర్థాలను వివరించారు. ఉదయపు నడక మిత్ర మండలి అధ్యక్షుడు జల్లు మురళీమోహన్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో కార్యదర్శి ఘంటసాల రాము, కోశాధికారి వి.లక్ష్మీనరసింహం, జోన్‌ఛైర్‌పర్సన్ కారుమూరి రాజేంద్రప్రసాద్, మహిళా విభాగం అధ్యక్షురాలు లంకిశెట్టి నీరజ, కార్యదర్శి విన్నకోట సత్యవతి, వై. జగన్‌మోహనరావు, పెసల వెంకటేశ్వర్లు, పి. మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఏడి అనిల్‌కుమార్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు అన్వేష్‌రెడ్డి, గోపాలకృష్ణ

ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు అమ్మొద్దు


మచిలీపట్నం టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : మెడికల్ షాపుల్లో ప్రిస్క్రిప్షన్ లేకుండా ఎన్ఆర్ఎక్స్, ఎక్స్ఆర్ఎక్స్ అమ్మడం నేరమని డ్రగ్స్ కంట్రోల్ అసిస్టెంట్ డైరెక్టర్ కోట అనిల్‌కుమార్ అన్నారు. కృష్ణాజిల్లా కెమిస్టు డ్రగిస్టు అసోసియేషన్ సర్వసభ్య సమావేశం మన కన్వెన్షన్ హాలులో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన అవగాహన సదస్సులో అనిల్‌కుమార్ మాట్లాడారు. స్లీపింగ్ టాబ్లెట్లు వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా అమ్మడం వల్ల దుర్వినియోగం అయ్యే ప్రమాదం ఉందన్నారు. మచిలీపట్నం డ్రగ్స్ ఇనస్పెక్టర్ బి. అన్వేషరెడ్డి, విజయవాడ డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ గోపాలకృష్ణ, గుడివాడ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఎం. విజయలక్ష్మి, ఈగల్ టాస్క్‌ఫోర్స్ ఎస్సై ఎం. వీరాంజనేయులు, రిటైర్డ్ అసిస్టెంట్ డైరెక్టర్ పరుచూరి రాంబాబు, కృష్ణాజిల్లా కెమిస్ట్ అండ్ డ్రగిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు భట్, కార్యదర్శి గుప్తా, మచిలీపట్నం అసోసియేషన్ అధ్యక్షుడు ఉదయగిరి సురేష్, కార్యదర్శి మాదిరెడ్డి అంజిబాబు, వైద్యులు యర్రా సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

బ్రాహ్మణ సంఘటన రాష్ట్ర అధ్యక్షుడు ఎఆర్‌కె మూర్తికి సత్కారం



మచిలీపట్నం టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ సంక్షేమ పథకాలు పేద బ్రాహ్మణులకు అందేలా కృషి చేస్తానని రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన రాష్ట్ర అధ్యక్షుడు ఎఆర్‌కె మూర్తి అన్నారు. బ్రాహ్మణ సంఘటన రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన హిందూ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ ఏఆర్‌కె మూర్తిని ఆదివారం పరాసుపేటలో ఘనంగా సత్కరించారు. బ్రాహ్మణులకు ఏ కష్టం వచ్చినా తన సెల్ నెం. 9848253505 కు ఫోన్ చేయవచ్చన్నారు. నాయకులు పి.వి.ఫణికుమార్, ధూళిపాళ శ్రీరామచబంద్రమూర్తి, నిమ్మగడ్డ శ్రీధర్, ఎం సుబ్రహ్మణ్యం, బొడ్డపాటి కుటుంబరావు, లొల్లా కుటుంబ శాస్త్రి, వడ్లమన్నాటి మారుతీ దివాకర్, జొన్నలగడ్డ శ్రీరామచంద్రమూర్తి, అద్దేపల్లి ప్రసన్న, గాదే శ్రీనివాస్ పాల్గొన్నారు.

మిస్సైల్ మ్యాన్ అబ్దుల్ కలాంకు ఘననివాళి



మచిలీపట్నం టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు జి. కిషోర్‌కుమార్ అధ్యక్షతన స్టార్ స్కూల్‌లో ఆదివారం అబ్దుల్ కలాం వర్ధంతిని నిర్వహించి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. పొట్లూరి వీరశేషగిరిరావు, డాక్టర్ హసీంబేగ్, పి. శ్రీరామ్, దిట్టకవి వెంకటేశ్వ రరావు, లంకిశెట్టి బాలాజీ, కరెడ్ల సుశీల, కారుమూరి రాజేంద్రప్రసాద్, బి. అయ్యప్ప స్వామి, మద్దాల చింతయ్య, డాక్టర్ మల్లికార్జునుడు, నూర్జహాన్, బాబా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. చల్లపల్లి : మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి స్వచ్ఛ చల్లపల్లి రథ సారథులు డాక్టర్ డిఆర్‌కె.ప్రసాద్ - డాక్టర్ టి.పద్మావతి, ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ గోపాలం శివన్నారాయణ, ప్రిన్సిపల్ నాగళ్ళ బీమారావు అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. షేక్ సిలార్, అబ్దుల్ జబ్బార్, రావి రవి, మహమ్మద్ కరీముల్లా, పైడిపాముల కాశ్మీర్, షేక్ మెహిద్దీన్, గువ్వాబత్తిన నాగేశ్వరరావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కృష్ణమ్మకు సమర్పణకు 300 చీరల సేకరణ

నాగాయలంక, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : కృష్ణమ్మకు ఈనెల 31వ తేదీ మధ్యాహ్నం 3.10 గంటలకు శ్రీరామపాదక్షేత్రం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో 401 చీరలతో మహావస్త్రాల సమర్పణ కార్యక్రమం జరుగనుంది. చీరలను భక్తులు స్వచ్ఛందంగా అందజేస్తున్నారు. నాగాయలంకకు చెందిన ప్రముఖులు చిట్టా హరికృష్ణ - వాణి దంపతులు ఆదివారం భక్తుల నుంచి 300 చీరెలను సేకరించి ఆలయానికి చేర్చారు. కృష్ణమ్మకు చీరెల సమర్పణ కార్యక్రమానికి జయప్రదం చేయాలని శ్రీరామపాదక్షేత్రం ఆలయ కమిటీ ఛైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు కోరారు.

నరేంద్ర స్వామి దేవాలయ జీర్ణోద్ధరణకు రూ.30 లక్షలు మంజూరు

నాగాయలంక, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : నంగేగడ్డలోని బాలాత్రిపుర సుందరిదేవి సమేత నరేంద్ర స్వామి దేవాలయ జీర్ణోద్ధరణకు ప్రభుత్వం రూ.30 లక్షలు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆదివారం తెలిపారు. రూ.45 లక్షల అంచనాతో తలపెట్టిన దేవాలయ జీర్ణోద్ధరణ పనులను మాచింగ్ గ్రాంటు రూ.15 లక్షలు, విడుదలైన నిధులతో ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు. రాజరాజ నరేంద్రుని కాలం నాటి ప్రాచీన ఆలయానికి దాదాపు 75 ఏళ్ల క్రితం నిర్మించిన ముఖ మండపాలు శిథిలావస్థకు చేరినట్లు తెలిపారు. ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ధన్యవాదాలు తెలిపారు.

శ్మశాన వాటికలో శివుడి విగ్రహ నిర్మాణానికి రూ.85 వేల విరాళం



కోడూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : నరసింహపురం రోడ్డులోని హిందూ శ్మశాన వాటిక అభివృద్ధి పనులలో భాగంగా ఏర్పాటు చేసే శివుని విగ్రహ నిర్మాణానికి ఆర్యవైశ్య ప్రముఖులు బూరగడ్డ హరినాథ్‌బాబు రూ.85 వేలు విరాళాన్ని అందించారు. ఆదివారం హరినాథ్ (హరి) షాపు వద్ద అభివృద్ధి కమిటీ సభ్యులు తోట శ్రీనివాసరావు విరాళాన్ని అందుకున్నారు. తన తండ్రి బూరగడ్డ నాగేశ్వరరావు జ్ఞాపకార్థం శివుని విరాళాన్ని అందిస్తున్నట్లు హరినాథ్ తెలిపారు. హరినాథ్‌బాబుకు అభివృద్ధి కమిటీ సభ్యులు అభినందనలు తెలిపారు. అన్నం శివరామకృష్ణ, అద్దేపల్లి సత్యనారాయణ (బుజ్జి) పాల్గొన్నారు.

దూపదీప నైవేద్యం పథకానికి శ్రీరామ మందిరం ఎంపిక

కోడూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : దేవదాయశాఖ దూప దీప నైవేద్యం పథకంలో జయపురంలోని శ్రీరామ మందిరం ఎంపికైనట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆదివారం తెలిపారు. తన విజ్ఞప్తి మేరకు సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలతో దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఈ ఆలయానికి ప్రతి నెలా రూ.10 వేలు ఆర్థిక సాయం మంజూరు చేయనున్నట్లు వివరించారు. సీఎం చంద్రబాబుకు, మంత్రి రామనారాయణ రెడ్డికి ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ధన్యవాదాలు తెలిపారు.

మెరైన్ పోలీసుల సూచనలు తప్పక పాటించాలి

కోడూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : హంసలదీవి బీచ్ వద్దకు విచ్చేసిన పర్యాటకులు మెరైన్ పోలీసుల సూచనలు తప్పక పాటించాలని పాలకాయితిప్ప మెరైన్ ఎస్సై పూర్ణ మాధురి అన్నారు. బీచ్ వద్దకు కుటుంబసమేతంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులకు స్నానాలు చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సముద్ర తీరం వెంబడి మెరైన్ సిబ్బంది గస్తీ నిర్వహించారు.

చిట్టిపాలెం, అరిసేపల్లిలో ఉచిత నేత్ర వైద్యశిబిరం

మచిలీపట్నం టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : మన శరీరంలోని అన్ని అవయవాల్లో కెల్లా నేత్రాలు ప్రధానమని, నేత్రాల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా సార్వత్రిక ప్రభుత్వ వైద్యశాల డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ భానుమూర్తి అన్నారు. బందరు మండలం అరిసేపల్లి, చిట్టిపాలెం గ్రామాల్లో ఆదివారం సత్యసేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్యశిబిరాలు నిర్వహించారు. సమితి కన్వీనర్ పోతుకూచి ఆంజనేయులు , చిట్టిపాలెం గ్రామపెద్ద రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సూర్యనారాయణ స్వామి శాంతి కల్యాణం

అవనిగడ్డ రూరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : వేకనూరులో సూర్యనారాయణ స్వామి శాంతి కళ్యాణం ఆదివారం వైభవంగా నిర్వహించారు. పాకలపాటి రాము బ్రహ్మత్వంలో గుడివాక రామానుజ - లక్ష్మి దంపతులు, కడవకొల్లు వెంకటేశ్వరరావు - విజయలక్ష్మి దంపతులు పీటల మీద కూర్చుని కళ్యాణ క్రతువు నిర్వహించారు. అనంతరం గుడివాక రామానుజ - లక్ష్మీ దంపతుల ఆర్థిక సాయంతో భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ ధర్మకర్తలు తుంగల వీరవసంతరావు - ఇందిరా దంపతులు పర్యవేక్షించారు.

పైడమ్మకు నైవేద్యం సమర్పణ

పెడన, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : కాపు సామాజిక వర్గానికి చెందిన మహిళలు , ఇలవేల్పు పైడమ్మ అమ్మవారికి ఆదివారం చలిమిడి, వడపప్పు నైవేద్యం సమర్పించారు. శ్రావణమాసం తొలి ఆదివారం పైడమ్మ అమ్మవారికి చలిమిడి, వడపప్పు నైవేద్యంగా సమర్పించడం ఆనవాయితీ. వినాయకుడి గుడి నుంచి మేళతాళాలతో ఊరేగింపుగా బయలుదేరి కొత్తపేటలోని పైడమ్మ ఆలయానికి చేరుకుని అక్కడ అమ్మవారికి భక్తిశ్రద్ధలతో చలిమిడి, వడపప్పు నైవేద్యం సమర్పించారు. అమ్మవారిని పురవీధుల్లో కన్నుల పండువగా ఊరేగించారు.

కొమరగిరి జయప్రద కన్నుమూత



మచిలీపట్నం టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : బాలాజీ విద్యాలయం వ్యవస్థాపకురాలు, శ్రీవాణి పత్రిక సంపాదకురాలు, రచయిత్రి కొమరగిరి జయప్రద(80) ఆదివారం తెల్లవారుజామున కన్నుమూశారు. దివంగత బీజేపీ నాయకుడు కొమరగిరి కృష్ణమోహనరావు సతీమణి కొమరగిరి జయప్రద మృతికి మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, డీసీఎంఎస్ ఛైర్మన్ బండి రామకృష్ణ, ప్రైవేట్ పాఠశాలల సంఘ నాయకులు వి. సుందరరాం, మచిలీపట్నం సత్యసాయి సేవా సమితి కన్వీనర్ పోతుకూచి ఆంజనేయకుమార్ తదితరులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఆమె కుమారులు కొమరగిరి చంద్రశేఖర్, కొమరగిరి శ్యామ్, కొమరగిరి ఉదయకుమార్‌లను పలువురు ప్రముఖులు పరామర్శించారు.